RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

సంపుటి : 03 | సంచిక : 272 | రంగారెడ్డి | ఎడిటర్ : గంజి వెంకటేశ్ | బుధవారం , సెప్టెంబర్ 24, 2025 | పేజీలు : 8 | వెల: 3 రూ.

Volume: 03 | Issue :272 | Rangareddy | Editor: Ganji Venkatesh | Wednesday, September 24, 2025 | Pages:8 | Price: 3/-

## ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యకు
# సిఎం అభినందనలు



హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఇటీవల అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నుంచి ఉత్తమ క్రీడాకారిణి అవార్డును సౌమ్య అందుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఆమె ఆటలో చూపిస్తున్న ప్రతిభను సిఎం ప్రశంసించారు. మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డిని క్రీడాకారిణి సౌమ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్ అథారిటీ– చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్ అథారిటీ– ఎండి సోనీ బాలాదేవి, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.మహ్మద్ అలీ రఫాత్, ప్రధాన కార్యదర్శి పాల్గుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ జాతరకు కేంద్రం
# నిధులు ఇవ్వాల్సిందే

- కేంద్రానికి సిఎం రేవంత్ డిమాండ్
- మేడారం సందర్శన..అభివృద్ధి పనులపై సమీక్ష
- జాతర లోగా పనుల పూర్తికి ఆదేశాలు
- గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పించిన రేవంత్ రెడ్డి







ములుగు,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాటు–చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు– తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. సమ్మక్క–సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క –సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపా–రు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చానని వివరించారు. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రా–యాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క

3 లో



## కెసిఆర్ కుటుంబ జల్సాలకు
# రాష్ట్రం తాకట్టు

- లక్షల కోట్లు అప్పులు చేసి ఆగంచేసారు
- మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

ఖమ్మం,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి తెచ్చిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే.. పదేండ్లు పరిపాలించిన నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలు నిలదీస్తే సమాధానంచెప్పడం లదన్నరు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని భావించి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కుటుంబం చేతిలో పదేండ్లు తెలంగాణ బందీ అయ్యిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో నెలకు 11 వేల కోట్ల వడ్డీలు కడుతున్నామని, గత పాలకులు చేసిన 26 వేల కోట్ల అప్పుకు 11.50 శాతం ఉన్న వడ్డీని 8 శాతానికి తగ్గించామని డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం క్యాబినెట్ పనిచేస్తున్న తీరును చూసి రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారని తెలిపారు.ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జిల్లా నాయకులే కాదు.. ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరడానికి వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని, వారి కుటుంబ అవసరాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు– పెట్టారని మండిపడ్డారు. అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిశామని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఉప్పు, పప్పు ఏది కొనుగోలు చేసినా పన్ను చెల్లిస్తున్నారని, ఆ పన్నులతోనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ఖజానాలోని ప్రతి పైసాకు అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఉద్యోగులు సకల జనుల సమ్మె చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం కృషి చేస్తే గత పాలకులు ఉద్యోగులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని వెల్లడించారు.

## ఒక్క ఇంటికీ నీరు ఇచ్చిన
# దాఖలాలు లేవు

- మిషన్ భగీరథతో 42వేల కోట్లు వృధా
- రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన కెసిఆర్ ప్రభుత్వం
- మంత్రి వివేక వెంకటస్వామి విమర్శలు



మంచిర్యాల,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకం అట్టర్ ఫ్లాప్ అని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. 42 వేల కోట్ల రూపాయలతో మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చి ఒక్క ఇంటికి చుక్క తాగు నీరు అందించలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాల పేరుతో వేల కోట్ల ప్రజా ధనాన్ని దోచుకుందని విమర్శించారు. మందమర్రి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 82 మంది లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కులను మంత్రి వివేక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులతో కేసీఆర్ రాచరిక పాలన సాగించాడని విమర్శించారు. పదేండ్లలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8లక్షల కోట్ల అప్పుకు నెలకు రూ.5 వేల కోట్ల వడ్డీ కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కేసీఆర్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని ఫైర్ అయ్యారు.

3 లో

## వరంగల్‌లో కొత్తగా
# వెల్‌నెస్ సెంటర్

- ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ వెల్‌నెస్ సెంటర్ ని ఆమోదించింది. ఈ సౌకర్యం ప్రధానంగా

3 లో

## నెలల తరబడి పెండింగ్‌లో
# రేషన్ కమీషన్

కేంద్ర,రాష్ట్ర ప్రబుత్వాలపై మండిపడ్డ హరీష్ రావు



హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు మండిపడ్డారు. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్ డీలర్లకు.. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు–ంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణమని అన్నారు. రేషన్ డీలర్లు మంగళవారం నగరంలోని తన నివాసంలో హరీష్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతో పాటు– కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదని, ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు తప్ప చేతలులేని కోతల ప్రభుత్వం ఇది అని విమర్శించారు. బిఆర్ఎస్

3 లో

## చార్మినార్ వద్ద బిజెపి బతుకమ్మ

- పాల్గొన్న బిజెపి నేతలు, నటి ఖుష్బూ



హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో పార్టీ శ్రేణులు, ప్రజలు, సాంస్కృతిక ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వేడుకలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, తమిళ్‌నాడు బీజేపీ నేత, సినీ నటి కుష్బూ, మాజీ మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి పాల్గొన్నారు. చార్మినార్ ప్రాంగణంలో పూలతో అలంకరించిన బతుకమ్మ ఆడిపాడారు. బతుకమ్మ పాటల కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, పిల్లలు సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ నృత్యం చేసి, పండుగ జరుపుకున్నారు. ఈ వేడుకల్లో కుష్బూ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



## తిరుమల బ్రహ్మోత్సవాలకు
# శ్రీకారం

- శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం

తిరుమల,సెప్టెంబర్23(పద్మక్రాంతి):

తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవారి తరఫున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా

3 లో

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం: కోమటిరెడ్డి




నల్లగొండ,సెప్టెంబర్23 (పద్మక్రాంతి):

బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలయ్యిందని..అది మునిగిపోయే నావ అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్గొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన.. నల్గొండ జిల్లాలో ఓ నాయకుడు ఉన్నాడు.. ఎప్పుడూ గెలిచిన రెండు వేల లోపు మెజార్టీనే ఇక మళ్ళీ గెలవడని జగదీష్ రెడ్డిని ఉద్దేశించి సెటైర్ వేశారు. నల్గొండ గడ్డ కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.. కాంగ్రెస్ కండువా మోసే నిఖార్సైన కార్యకర్తలే పార్టీకి బలం అని చెప్పారు. 30 ఏళ్లుగా తనను అక్కున చేరుకున్న కార్యకర్తలకు ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేనన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేర్చే బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. గ్రామీణ రోడ్లు అన్ని డబుల్ రోడ్లుగా మారుస్తా .. విద్యా,వైద్యంలో ఇంకా మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా వంద శాతం కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని చెప్పారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం


## భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడమే ట్రంప్ లక్ష్యం !

ట్రంప్ టారిఫ్‌లు, వీసా ఫీజులు అంతా కూడా కేవలం భారత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవే. భారత్ ఆర్థిక మూలాలలను దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నాయి. అమెరికాకు మోకరిల్లాలే తప్ప కాలర్ ఎగరేసుకుని తిరగరాదన్న ఆధిపత్య ధోరణి ట్రంప్‌లో కనిపిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి అన్నది ఒక సాకు మాత్రమే. భారత్ ఆర్థిక శక్తిగా ఎదగడాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఓట్ల కోసం భారత్‌ను,ఎన్నారైల కాళ్లావేళ్లా పడి,మోడీతో చెలిమిని నటించిన ట్రంప్ గెలిచాక గేర్ మార్చడం వెనక సొంత ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. భారత్ ఆర్థికంగా ఎదిగితే తమకు పోటీదారు అవుతుందన్న బెంగ ప్రధానంగా ఉంది. దీనికితోడు సైనికంగా స్వయం సమృద్ధిని సాధించడానికి కూడా ట్రంప్ తట్టుకోలేక పోతున్నాడు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తరవాత ఆయనలో అసహనం పెరిగింది.భారత్ సైనిక సత్తాచాటడం స్వదేశీ ఆయుధాలతోనే పాక్ పీచమణిచింది. పాక్‌లో స్థావరం ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న అమెరికాకు ఇది గిట్టడం లేదు. పాక్‌కు తాము సరఫరా చేసిన ఆయుధా లు కూడా పనిచేయకపోవడం అవమానంగా భావిస్తోంది. ఈక్రమంలోనే పాక్ ఆర్మీ చీఫ్‌ను పిలిచి ట్రంప్ మరీ చంకన కూర్చోబెట్టుకున్నారు. పాక్‌తో వాణిజ్యం మొదలు పెట్టారు. పాక్ ఆయిల్ అమ్మకం దారుగా ఎదుగుతుందని, భారత్ కూడా కొనాల్సి వస్తుందని బెదరించారు. ఇలా చేస్తూనే 50శాతం సుంకాలను ఎకాఎకిన పెంచేశారు. అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులను కొనేలా ఒత్తిడి తెస్తున్నారు. మొత్తంగా భారత్ మార్కెట్‌ను దెబ్బతీసే కుట్ర కూడా ఇందులో దాగివుంది. ఇదే క్రమంలో వీసా పిడుగులు కురిపించారు. ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేశారు. ఓ రకంగా ఇదో బెదరింపు చర్యగా చూడాలి. 70శాతం పైగా హెచ్-1 వీసాదారులు భారతీయులు. అందుకే దీని ఫీజును అమాంతంగా లక్ష డాలర్లు చేశారు. తొలిరోజు ప్రకటన చేసే సమయంలో అక్కడి కామర్స్ మినిస్టర్ ఇది ఏడాదికోమారు ఉంటుందని, వెంటనే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. దీంతో అమెరికాలో ఉన్న భారతీయ వీసాదారులు భయపడ్డారు. తరవాత ప్రెస్ సెక్రటరీ విడుదల చేసిన నోట్‌లో పూర్తి భిన్నంగా ఉంది. లక్ష డాలర్ల ఫీజు కొత్త వారికేనని, పాతవారికి, రెన్యువల్ చేసుకునే వారికి లేదని,ఇది వచ్చే యేడు నుంచి అమల్లోకి వస్తుందని వివరణ ఇచ్చారు.మొత్తంగా ఇదంతా భారత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవే అని తేలింది. ఈ క్రమంలో భారత్ కూడా అప్రమత్తంగా ఉండాలి. దేశీయంగా మన టెక్నాలజీకి పదను పెట్టాలి. మన దగ్గరే ఉద్యోగావకాశాలు పెంచాలి. ఓ రకంగా చెప్పాలంటే ట్రంప్‌తో పాటు, పాక్ కూడా మోడీ తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకి స్తున్నాయి. అందుకే పాక్ అమెరికాకు మరింత దగ్గరకావడానికి అవకాశం వచ్చింది. ఒసామాబిన్ లాడెన్ ఉగ్రచర్యలను ట్రంప్ మరచిపోయారు. పాక్‌ను దువ్వి పాలు పోస్తున్నారు. దీనికి అమెరికా మూల్యం చెల్లించుకోక తప్పదు. పాక్ కూడా అమెరికా అండతో భారత్‌పై మరింత కాలుదువ్వే అవకాశాలు ఉన్నాయి. ఉగ్రచర్యలను ప్రేరేపించవచ్చు. ఎందుకంటే మోడీ ఉన్నంత కాలం తమదేశం స్వేచ్ఛగా ఉంటుందన్న నమ్మకం కోల్పోయింది. గతంతో పోలిస్తే మోడీ పాక్ పట్ల కఠినంగానే ఉంటున్నారు. అణుబెదిరింపులను పూచికపుల్లతో తీసేసారు. ప్రతిగా ఘాటుగా సమాధానం ఇస్తున్నారు.మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంనుంచి దిగిపోవాలని పాక్ చూస్తోంది. అందుకు ఇప్పుడు పాకిస్తాన్‌తో సంబంధాలు మోడీకి ముందు, మోడీకి తర్వాత అన్నట్లుగా మారాయి. గతంలో పాకిస్తాన్ ఎన్ని ఉగ్రవాద దాడులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలు కానీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం కానీ దౌత్య సంబంధాలను పూర్తిస్థాయిలో తగ్గించుకునే ప్రయత్నం చేయలేదు. పాకిస్తాన్ పట్ల విదేశాంగ విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. పాకిస్తాన్‌లో పౌర ప్రభుత్వం ఉన్నా, సైనిక ప్రభుత్వం ఉన్నా

దౌత్య సంబంధాలు బాగానే ఉన్నాయి. కొన్ని సార్లు బ్యాక్-ఛానెల్ దౌత్యం ద్వారా రెండు దేశాలు సంబంధాలు నెరిపాయి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత, స్వయంగా అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంట్లో శుభకార్యం ఉంటే లాహోర్ వెళ్లాడు. పాక్‌కి స్నేహ హస్తం చాచారు. కానీ, యథావిధిగా పాకిస్తాన్ తన బుద్ధి చూపిస్తూ వచ్చింది. పఠాన్ కోట్, ఉరీ, పుల్వామా, పహల్గామ్ ఇలా ఉగ్రవాద దాడులకు పాల్పడుతూనే ఉంది.ఇన్నాళ్లు పాకిస్తాన్‌కు ఓ ధీమా ఉండేది. భారత్‌పై దాడి చేస్తే, పాకిస్తాన్‌ను నిందిం చడం, ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోరనే ధీమాతో ఉండేది. కానీ, మొదటిసారిగా ఉరీ దాడి తర్వాత, భారత సైన్యం పీఓకేలోకి వెళ్లి సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. పుల్వామా దాడి తర్వాత బాలాకోట్ స్ట్రయిక్స్ చేసింది. తాజాగా, పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ తో పాక్ సైన్యం ఎయిర్ బేసులతో పాటు-, పాకిస్తాన్ లోపల ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఇలా భారత్ ప్రతీకారం తీర్చు కోవడం అనేది, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతే జరుగుతుండటంతో పాకిస్తాన్, ప్రస్తుత ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్, రాహుల్ గాంధీలను పాక్ నాయకులు, ఆ దేశ సెలబ్రిటీలు ప్రశంసించడం చూస్తుంటే, అప్పటి యూపీఏ హయాంలోనే మా పరిస్థితి బాగుండేది అని భావిస్తున్నట్లు- కనిపిస్తోంది. అంతేగాకుండా మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు పాక్ పాలకు తీరును బట్టి అర్థం అవుతోంది. పాకిస్తాన్‌తో 1965, 1971, 1999 కార్గిల్ వార్ సమయాల్లో కూడా మన దేశం పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను ఎప్పుడూ పూర్తిగా తెంచుకోలేదు. పాక్‌కి ఆధారమైన సింధూ నది ఒప్పందంను ఎప్పుడూ నిలుపుదల చేయలేదు. కానీ మోడీ వచ్చిన తర్వాత దాయాదికి క్లియర్ మెసేజ్ ఇచ్చారు. రక్తం, నీరు కలిసి ప్రవహించవని చెప్పి, సింధూ ఒప్పందాన్ని నిలిపేశారు. దీంతో ఒక్కసారిగా పాకిస్తాన్ లో హాహాకారాలు మొదలయ్యాయి. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగే ప్రసక్తే లేని స్పష్టం చేశారు. ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి సాగవని చెప్పారు. అలాగే మనదేశంలో కూడా మోడీ రాకతో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ లభించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, పాక్ కవ్వింపులను ధీటుగా ఎదుర్కొనేందుకు ఎలాంటి అనుమతులు అక్కర లేకుండా వెంటనే నిర్ణయం తీసుకునే వెసులుబాటు సైన్యానికి కల్పించారు. గతంలో సరిహద్దుల వెంబడి పాక్ సైన్యం కాల్పులు జరపడం, మన సైనికుల్ని అపహరించి తలలు నరికిన సందర్భాలు ఉన్నాయి. కానీ మోడీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పాక్ యాక్షన్‌కు అంతకన్నా సీరియస్ రియాక్షన్ ఉంటుందని తన చర్యల ద్వారా స్పష్టం చేశారు. దీంతో సైన్యం కూడా పాక్‌ని ఎప్పటికప్పుడు దెబ్బ తీస్తుంది. ఇన్నాళ్లు, పాకిస్తాన్ తన అణ్వాయుధాలను చూపిస్తూ బ్లాక్‌మెయిల్ చేసేది, ఆపరేషన్ సిందూర్‌తో ఇక ఈ బ్లాక్‌మెయిల్‌ని సహించేది లేదని భారత్ స్పష్టం చేసింది. పాక్ అణ్వాయుధాలు నిల్వ చేస్తారనే ప్రచారం ఉన్న కిరాణా హిల్స్ సమీపంలో భారత్ దాడులు చేసి గట్టి సందేశం ఇచ్చింది. ప్రధాని మోడీ కూడా ఇక పాక్ అణ్వాయుధ బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ముంబై ఉగ్రదాడుల సమయంలో భారత్ వైఖరి, కాంగ్రెస్ ప్రతిస్పందనతో పోలిస్తే మోడీ వచ్చాక కాస్త మార్పు వచ్చిందని దేశ ప్రజలే చెబుతున్నారు. అందుకే పాకిస్తాన్ ప్రజలు, అక్కడి నేతలు మోడీ ఎన్నికల్లో ఓడిపోవాలని కోరుకుంటున్నారు. మోడీ ఓడిపోవాలని పాక్ కోరుకుంటున్నట్లు పాక్ మాజీ మంత్రి ఫవాద్ చౌదరి అన్నారు. మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో, సిట్టింగ్ ఎంపీలు పదే పదే మోడీని విమర్శిస్తూ వస్తున్నారు. అమెరికా తోడు వచ్చింది కనుక ఇక తమకు తిరుగులేదని భావిస్తోంది. తాజాగా ట్రంప్ తీసుకుంటున్న చర్యలు కూడా ఓ రకంగా పాక్‌కు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలుగానే చూడాలి.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు

- గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ
- భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



**విజయవాడ,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీ మంత్రంలో అనుబంధం ఉంది. అందుకే ఆయా దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి 'రుద్రగాయత్రి', 'లక్ష్మీగాయత్రి', 'విష్ణుగాయత్రి' అని గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు నివేదన చేస్తారు. సకల మంత్రాలకి మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టానదేవత. ఆ తల్లి అధిష్టాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల సూర్యుడు అనుగ్రహంతో ఆరోగ్యం లభిస్తుందని నమ్మిక. ప్రాతఃకాలంలో గాయత్రి గాను, మధ్యాహ్న కాలంలో సావిత్రి గాను, సాయంసంధ్యలో సరస్వతి గాను ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. వరదాభయహస్తాలతో సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ దుర్గమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయని, పూజించిన వారికి సద్బుద్ధులు కలుగుతాయని,. పాపాలు నశిస్తాయని, అజ్ఞానం తొలగిపోతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రోజున ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మ శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తోంది. దేవీ నవరాత్రులలో రెండవ రోజు ఆశ్వయుజ శుక్ల తదియ నాడు కదంబవనవాసిని అయిన ఆ పరమేశ్వరి శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులతో పూజలను అందుకుంటుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ కనక దుర్గమ్మ నవరాత్రులలో రెండో రోజున చతుర్వేద స్వరూపమైన శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో కాషాయం రంగు లేదా కనకాంబరం చీర ధరించి అత్యంత సుందరంగా భక్తులకు దర్శనం ఇస్తుంది. ఇంద్రకీలాద్రిపై గాయత్రి దేవిగా దర్శనం ఇస్తున్న దుర్గమ్మ దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామున 3 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం అయ్యాయి. కాగా దసరా నవరాత్రులలో మొదటి రోజు భక్తజనం విశేషం గా తరలివచ్చారు. 60 వేల మందికి పైగా భక్తులు బాల త్రిపుర-సుందరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు పలు రకాల సేవల, దర్శన టికెట్ల రూపేణా రూ. 22 లక్షల 72 వేల 214 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ సిబ్బంది చెప్పారు.

# మావోయిస్ట్ పార్టీలో గందరగోళం

- మల్లోజుల లేఖపై పార్టీలో అసహనం
- పార్టీకి సంబంధం లేదని వెల్లడి
- వేణుగోపాల్‌ను ఉద్యమద్రోహిగా ప్రకటన
- ఆయుధాలు సరెండర్ చేయాలని ఆదేశం

**ఖమ్మం,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

మావోయిస్ట్ పార్టీలో గందరగోళం నెలకొంది. అగ్రేతలు ఒక్కొక్కరే నేలకు ఒరుగుతున్నారు. పటిష్ట నాయకత్వం లేకుండా పోయింది. దీనికితోడు కోవర్ట్ ఆపరేషన్లు పార్టీ ఉనికినే దెబ్బతీస్తున్నాయి. మరోవైపు వరుస ఎన్÷-కౌంటర్లు పార్టీని తుడిచి పెట్టేలా చేస్తోంది. ఆపరేషన్ కగార్‌తో నేతలను మట్టుబెడుతున్నారు. రిక్రూట్‌మెంట్ కూడా పూర్తిగా ఆగిపోయింది. ఈ క్రమంలో సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని మావోయిస్టు సీనియర్ నేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. దీంతో తేరుకున్న మావోయిస్టులు అది పార్టీ విధానం కాదని ప్రకటించింది. ఆయనను ఉద్యమద్రోహిగా ప్రకటించింది. మల్లోజులపై మావోయిస్టు కేంద్ర కమిటీ చర్యలు తీసుకుంది. అతడిని ద్రోహిగా ప్రకటించడంతోపాటు-, ఆయన వద్ద ఉన్న ఆయుధాలను వెంటనే పార్టీకి అప్పగించాలని ఆదేశించింది. లేనట్లయితే వాటిని పీపుల్స్ గొరిల్లా ఆర్మీ స్వాధీనం చేసుకుంటు-ందని హెచ్చరించింది. ఆయుధాలు వదిలేసేందుకు సిద్ధంగా ఉన్నా మంటూ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి హోదాలో అభయ్ పేరుతో మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల లేఖ విడుదల చేసిన క్రమంలో పార్టీలో గందరగోళం ఉందని అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రకటనను తప్పుబట్టిన కేంద్ర కమిటీ, పార్టీపై మల్లోజుల వేణుగోపాల్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. కాల్పుల విరమణ, శాంతి చర్చలపై అతడి ప్రకటనను ఖండించింది. లొంగిపోయేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొంది. మావోయిస్టు నేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీకి వేణుగోపాలరావు తమ్ముడు అవుతారు. మారిన ప్రపంచ, దేశ పరిస్థితుల దృష్ట్యా.. ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతి లో చేరాలని ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి, సీనియర్ పోలీస్ అధికారులు నిరం తరం చేసిన అభ్యర్థనల దృష్ట్యా తమ పార్టీ ఆయుధాలను వదులు కోవాలని నిర్ణయించుకుంటు-న్నదని ఆ పార్టీ నేత అభయ్ పేరుతో ఈ నెల 16న ఒక లేఖ విడుదలైన విషయం తెలిసిందే. సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని అందులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పై అన్ని రాజకీయ పార్టీలు, పోరాడుతున్న సంస్థలతో వీలైనంత వరకు కలిసి పోరాడుతామని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హోంశాఖ మంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు- తెలిపారు. మారిన తమ పార్టీ అభిప్రాయం గురించి పార్టీకి తెలియజేయడం తమ బాధ్యత అని, పార్టీలో ఈ అంశాన్ని అంగీకరించేవారు లేదా వ్యతిరేకించేవారు చర్చల్లో అంగీకరించి పాల్గొనే సహచరుల నుంచి ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ప్రస్తుతం తమతో అందుబాటులో ఉన్న పరిమిత క్యాడర్, కొంతమంది నాయకత్వ సహచరులు ఈ కొత్త విధానాన్ని పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు- తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సహచరులతో, జైల్లో ఉన్న సభ్యులతో సంప్రదించేందుకు నెలరోజుల గడువు ఇస్తూ 'సీజ్ ఫైర్' చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకునేందుకు కూడా తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్టు- తెలిపారు. అయితే, మావోయిస్టు పార్టీలో మారిన ఈ విధానం సంచలం సృష్టిస్తున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం లీడర్ బసవరాజు మృతి తరువాత ఇటీవల కొత్త నాయకత్వంలో భాగంగా ఆయన స్థానంలో తిప్పిరి తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకున్న నేపథ్యం లో ఈ లేఖ విడుదల అవ్వడం మరింత సంచలనం కలిగిస్తున్నది. అంతేకాకుండా, ఎన్నడూ లేని విధంగా మావోయిస్టు నేత ఫొటోతో ఆ పార్టీ లేఖను విడుదల చేయడం దేశంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్చానీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ- ప్రతినిధి అభయ్ పేరుతో వచ్చిన ఈ లేఖ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి, మావోయిస్టు ఉద్యమ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంశాఖ మంత్రులు శాంతిచర్చల పట్ల అనుకూలమైన వైఖరిని అవలంబించిన పాలక, ప్రతిపక్ష పార్టీల నాయకులు, శాంతి కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజల ముందు మావోయిస్టు పార్టీ తన మారిన వైఖరిని స్పష్టంచేస-్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతిచర్చలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి విజ్ఞప్తి చేస్తున్నట్టు- మావోయిస్టు పార్టీ తెలిపింది. ఇదే ప్రతిపాదనపై మే 10న మావోయిస్టు పార్టీ ప్రతినిధి అభయ్ పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు- తాజా లేఖలోనూ మావోయిస్టులు తెలిపారు. అందులో తమ పార్టీ ఆయుధాలను వదులుకుంటు-న్నట్టు- ప్రస్తావించారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వానికి కాల్పుల విరమణ సైతం ప్రతిపాదించినట్టు- వివరించారు. ఈ ముఖ్యమైన అంశంపై తమ పార్టీ నాయకత్వ, సహచరు లతో సంప్రదించడానికి ఒక నెల రోజుల సమయం కావాలని కోరుతున్నట్టు- పేర్కొన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోగా.. గత ఏడాది జనవరి నుంచి వేలాది సంఖ్యలో జరుపుతున్న సైనిక దాడిని తీవ్రతరం చేసింది. వేలాదిమంది సాయుధ పోలీస్ బలగాలను మోహరించి చుట్టుముట్టి నిర్మూలన దాడి జరిపింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మే 21న మాడ్ ఏరియాలోని గుండెకోట్ సమీపంలో జరిగిన భీకరదాడిలో ధైర్యంగా ప్రతిఘటించిన తమ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు- 28 మంది కేంద్ర కమిటీ-సభ్యులు, సహచరులు, వారి భద్రతా సిబ్బంది అమరులైనట్టు- పేర్కొన్నారు. గతంలో జరిగిన శాంతిచర్చల ప్రక్రియను సగంలో వదిలి వే-యకుండా అభయ్ ఆలోచనలకు అనుగుణంగా శాంతి చర్చలను ముందుకు తీసుకువెళ్లాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు-, ఇందుకోసమే ఈ పత్రికా ప్రకటన విడుదల చేస్తున్నట్టు- వెల్లడించారు. తమ పార్టీ ప్రధాన కార్యదర్శి చొరవతో ప్రారంభమైన శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నట్టు- పేర్కొన్నారు. మొత్తంగా ఇప్పుడు మల్లోజుల వ్యవహారంతో మావోయిస్టుల్లో భేదాభిప్రాయాలు బట్టబయలు అయ్యాయి.

# ట్రంప్ చర్యలతో ఇంటాబయటా విమర్శలు

- వీసా ఫీజుల పెంపుతో అమెరికాకు నష్టమే
- కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

హెచ్1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనం సృష్టించడం ఒక ఎత్తయితే , దీనిపై దేశీయంగా, విదేశాల్లోనూ విమర్శలు వెల్లువెత్తున్నాయి. ట్రంప్ నిర్ణయంపై టెక్ కంపెనీలు సమాలోచనలు చేస్తున్నాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కారణాలతోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శశిథరూర్ మాట్లాడుతూ...ట్రంప్ నిర్ణయాలు దేశీయ రాజకీయాలతో ముడిపడి ఉంటాయని అభిప్రయాపడ్డారు. హెచ్1బీ వీసాల కారణంగా ఎక్కువ జీతాలు తీసుకొనే అమెరికన్ల కంటే, తక్కువ జీతాలు తీసుకొనే భారతీయుల వైపే అక్కడి కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని ట్రంప్ ఆయన కార్యవర్గం భావిస్తోంది. అయితే, ఫీజు లక్ష డాలర్లకు పెంచితే తమకు కావాల్సిన, ఎక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తులు మాత్రమే అమెరికాకు వస్తారని వారు అనుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనక ట్రంప్ లాజిక్ ఏంటో, ఇది నిజంగా వర్కౌట్ అవుతుందా అనేది నాకు అర్థం కావడం లేదు. దీంతో అనేక కంపెనీలు ఎక్కువ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్‌కు ఇచ్చేస్తాయని శశిథరూర్ పేర్కొన్నారు. ఇక, భారత దిగుమతులపై ట్రంప్ పెద్ద మొత్తంలో సుంకాలు విధించడంపైనా థరూర్ మాట్లాడారు. అనేక సమస్యల పరిష్కారానికి సుంకాలు అనేవి ఒక మాయా సాధనంగా ట్రంప్ భావిస్తున్నారన్నారు. ఈ టారిఫ్‌ల నుంచి వచ్చే బిలియన్ డాలర్లతో యూఎస్‌లో నెలకొన్న లోటును పూడ్చాలనేది ఆయన ఉద్దేశమై ఉంటుందన్నారు. అయితే, భారత్‌పై సుంకాల విధింపుతో ఆయనకు ఇక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. భారత్‌ను ఉద్దేశిస్తూ తరచూ ట్వీట్లు పెట్టడం, ఆయన సలహాదారుడు నవారో అభ్యంతరకర వ్యాఖ్యలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌కు కాస్త ఎదురుదెబ్బేనన్నారు. అయితే, ప్రస్తుతం వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని తాను భావిస్తున్నట్లు- తెలిపారు. ట్రంప్ కూడా పట్టుదలకు పోయి సాధించేదేమీ ఉండదన్నారు. చివరగా దేశంలోనే ఆయన విర్శలకు గురికాక



తప్పదన్నారు.

బుధవారం , సెప్టెంబర్ 24, 2025

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

తెలుగు దినపత్రిక

## ఆదివాసీ జాతరకు కేంద్రం

# నిధులు ఇవ్వాల్సిందే





సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టుకునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేసామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. తన రాజకీయ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను దర్శించుకుంటున్నానని అమ్మవార్ల ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆదివాసీల పోరాటానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తి అని కొనియాడారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ప్రాంతాల్లో అదనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ సంక్షేమ పథకం అయినా ఆదివాసీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని అన్నారు. సమ్మక్క సారక్కల గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణం మా జీవితంలో గొప్ప ఘట్టం. ఆలయ అభివృద్ధికి ఎన్ని కోట్లయినా ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధం. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, పూజారులు, సంప్రదాయ కుటుంబాలందరినీ భాగస్వాములను చేస్తున్నాం అని స్పష్టం చేశారు. మహాజాతరకు ముందే పనులు పూర్తిచేసేలా అధికారులు పగలు, రాత్రి పనిచేయాలని ఆదేశించారు. భక్తితో, సమ్మక్క మాలధారణ చేసినట్లుగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అదే సమయంలో, కేంద్రంపై విరుచుకుపడిన సీఎం రేవంత్ రెడ్డి, కుంభమేళాకు వేలకోట్లు ఇస్తున్న కేంద్రం, ఆదివాసీ కుంభమేళా మేడారం జాతరకు నిధులు ఎందుకు ఇవ్వడంలేదు? జాతీయ స్థాయిలో మేడారం జాతరకు గుర్తింపు ఇవ్వాలని, నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని స్పష్టం చేశారు. మహాజాతర సమయంలో తిరిగి వచ్చి, ఈ జాతరను మరింత ఘనంగా నిర్వహిస్తామని భక్తులకు హామీ ఇచ్చారు. చివరగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ పూజారులను సత్కరించారు. అలాగే ఆయన నిలువెత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించారు.

# లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కేసులో కస్టమ్స్ దాడులు

## నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ నివాసాల్లో సోదాలు



**కొచ్చి, సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

మలయాళం స్టార్ హీరోస్ దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసాలపై కస్టమ్స్ అధికారులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడులు మంగళవారం కొచ్చిలో పృథ్వీరాజ్ థేవరాలోని ఇంట్లో, అలాగే దుల్కర్ సల్మాన్ పనమ్పిల్లి నగర్‌లోని ఇంట్లో జరిగాయి. పృథ్వీరాజ్ తిరువనంతపురంలోని ఇంటిని కూడా అధికారులు తనిఖీ నిర్వహించారు. భూటాన్ నుంచి భారత్‌లోకి అక్రమంగా లగ్జరీ కార్లను స్మగ్లింగ్ చేస్తున్న ఒక పెద్ద నెట్‌వర్క్‌పై కస్టమ్స్ అధికారులు దేశవ్యాప్తంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖుల ఇళ్లపై దాడులు చేపట్టారు. కేరళలోని కొచ్చి, కోజికోడ్, మలప్పురంతో సహా దాదాపు 30 ప్రాంతాల్లో ఈ దాడులను ఏకకాలంలో కస్టమ్స్ అధికారులు చేపట్టారు. ఈ ఆపరేషన్‌కు 'నమ్‌కూర్' అని పేరు పెట్టారు. భూటాన్ సైన్యం ఉపయోగించిన లగ్జరీ కార్లను వేలంలో తక్కువ ధరలకు విక్రయించారు. అయితే ఈ పాత వాహనాలను కస్టమ్స్ సుంకాలు చెల్లించకుండా భారత్‌లోకి అక్రమంగా తరలిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో దేశ వ్యాప్తంగా పలువురు, సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖుల నివాసాలపై కస్టమ్స్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ హై-ఎండ్ వాహనాలను ముందుగా హిమాచల్ ప్రదేశ్‌కు అక్రమంగా రవాణా చేసి,
అక్కడ తాత్కాలిక చిరునామాలతో రిజిస్టర్ చేసుకుంటారు ఈ లగ్జరీ కార్ల ముఠా. ఆ తర్వాత వీటిని ప్రముఖ సినీ నటులు, వ్యాపారవేత్తలకు ఓ ముఠా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ రవాణా కోసం ఏజెంట్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారని అధికారులు తెలిపారు. భూటాన్-భారత్ మధ్య ఉన్న వ్యాపార ఒప్పందాల్లోని లసుగులను ఉపయోగించుకుని ఈ స్మగ్లింగ్‌కు పాల్పడు తున్నారని సమాచారం. భూటాన్‌లో ఈ వాహనాలను వేలంలో కొనడం చట్టబద్ధమే అయినప్పటికీ, భారత్‌లోకి సరైన పన్నులు చెల్లించకుండా తీసుకువచ్చి అమ్మడం కస్టమ్స్ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతోందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ కేరళ, లక్షద్వీప్ కమిషనర్ పర్యవేక్షణలో జరుగుతోంది. సినీనటుల ఇళ్లతో పాటు కలమస్సేరిలోని వ్యాపారవేత్తల నివాసాలు, మలప్పురం, కోజికోడ్‌లోని కార్ డీలర్‌షిప్‌లపై కూడా అధికారులు దాడులు చేస్తున్నారు. ఈ వాహనాలను కొనుగోలు చేసిన వారి జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఆ జాబితాలోని ప్రముఖుల ఇళ్లలో సోదాలు చేసి, నిజానిజాలను నిర్ధారించుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మేమంతా గిరిజనేతరులమే

- మా గ్రామాలను గిరిజన గ్రామాలుగా ఎలా గుర్తిస్తారు
- మంగపేట మండలంలోని 23 గ్రామాల ప్రజల వాదన
- స్థానిక ఎన్నికల్లో 23 గ్రామాల్లో స్టే విధిస్తూ సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించడంపై ఆయా గ్రామాల గిరిజనేతరులు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మేమంతా గిరిజనేతరులమే.. మా గ్రామాలను గిరిజన గ్రామాలుగా ఎలా గుర్తిస్తారు అంటూ మంగపేట మండలంలోని 23 గ్రామాల ప్రజల వాదించారు. దీంతో స్థానిక ఎన్నికల్లో 23 గ్రామాల్లో స్టే విధిస్తూ సుప్రీం ఆదేశం ఇచ్చింది. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కన పెట్టి.. నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## దూసుకెళ్తున్న బంగారం ధరలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

బంగారం ధర రోజురోజుకు రికార్డు స్థాయిలో దూసుకెళ్తోంది. తాజాగా దిల్లీలో మరో రూ.2 వేలకుపైగా పెరిగి రూ.1,18,900లకు చేరుకుంది. ముందు రోజు రూ.1,16,000గా నమోదైన విషయం తెలిసిందే. అటు- వెండి కూడా భారీగా పెరిగింది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం దిల్లీ మార్కెట్‌లో కిలో వెండి రూ.1,39,600కు చేరుకుంది. ఓవైపు డాలరుతో రూపాయి విలువ కనిష్ఠ స్థాయికి పడిపోవడం, హెచ్-1బీ వీసా రుసుము పెంపు నేపథ్యంలో బంగారం ధర సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది.

# ఇరాన్‌లో ఏటా పెరుగుతున్న మరణశిక్షలు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న మానవ హక్కుల సంఘాలు

**టెహ్రాన్, సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

ఇరాన్‌లో మరణశిక్షలపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్‌లో ఏటా మరణశిక్షలు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నాయి. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల ఈ శిక్షలను ఇరాన్ అమలు చేయడం గమనార్హం.. గతేడాది దాదాపు 975 మందికి మరణశిక్ష అమలు చేసినట్లు- అంచనా. ఈ ఏడాది ఇప్పటికే ఆ సంఖ్య దాటిపోయిందని నార్వే కేంద్రంగా పని చేసే ఐహెచ్‌ఆర్ వెల్లడించింది. బాహ్య ప్రపంచానికి తెలిసిన దానికంటే వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉండవచ్చని ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ మహమూద్ అమిరీ-మొగద్దాం పేర్కొన్నారు. గడిచిన వారం వ్యవధిలోనే 64 మందికి మరణశిక్ష అమలు చేసిందని, సరాసరి నిత్యం తొమ్మిది మందిని ఉరి తీసినట్లు- ఇరాన్ మానవ హక్కుల బృందం వెల్లడించింది. మొత్తంగా ఏడాది ఇప్పటికే 1000 మందికి మరణదండన అమలు చేసిందని అంచనా వేసింది.

గతంలో అనేక విధాలుగా మరణదండన అమలు చేసిన ఇరాన్.. ప్రస్తుతం ఉరిశిక్ష ద్వారానే ఎక్కువగా అమలు చేస్తోందని సమాచారం. అత్యధికం జైళ్లలో చేపడుతున్నప్పటికీ.. బహిరంగ శిక్షలు కూడా చేపడుతోంది. హత్య, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అత్యాచారం, లైంగిక దాడి వంటి నేరాలకు ఈ తీవ్ర శిక్ష విధించి అమలు చేస్తోంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా పలు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల ప్రకారం.. చైనా తర్వాత అత్యధిక సంఖ్యలో మరణదండన అమలు చేస్తున్న దేశాల్లో ఇరాన్ రెండో స్థానంలో ఉంది. బీజింగ్ ఏటా వేలాది మందికి మరణశిక్ష అమలు చేస్తుందనే వాదన ఉన్నప్పటికీ.. ఈ విషయంలో పూర్తి వివరాలు అందుబాటులో లేవు.

మొదటి పేజీ తరువాయి ..

## ఒక్క ఇంటికీ నీరు ఇచ్చిన

# దాఖలాలు లేవు

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం బీఆర్ఎస్ లీడర్లకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. 9 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లలో ఒక్క రేషన్ కార్డు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 17 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనుల ఆక్షన్‌లో పాల్గొనకుండా చేసిందని.. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఉద్యోగాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మందమర్రి ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా ఉండేవని.. తానొచ్చాక 50 కోట్ల రూపాయల తో అభివృద్ధి చేపట్టానని తెలిపారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం పెద్ద పెద్ద కట్టడాలు నిర్మించిందని ఆరోపించారు. అమృత్ స్కీంతో మందమర్రి ప్రజలకు శాశ్వత మంచినీటి సౌకర్యం కలుగుతుందని చెప్పారు.

## నెలల తరబడి పెండింగ్‌లో

# రేషన్ కమీషన్

ప్రభుత్వ హయాంలో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని గుర్తు చేశారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను 900 నుంచి 1400 రూపాయలకు పెంచామని, ప్రభుత్వంపై 139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. 2014లో మెట్రిక్ టన్నుకు 200 రూపాయలుగా ఉన్న కమీషన్‌ను, 1400 రూపాయలకు పెంచామని, 17వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపామని అన్నారు. కమీషన్ చెల్లించడమే కాదు, కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామని చెప్పారు. రేషన్ డీలర్‌షిప్ వయో పరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంచామని అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని సైతం అమలు చేయకుండా రేషన్ డీలర్ల పాలిట శకునిలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమీషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబర్ కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు- 5 వేల గౌరవ వేతనం, కమీషన్ పెంపు ప్రకటించాలని హరీశ్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## వరంగల్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్‌లకు ఉపయోగపడనుంది. అయితే, సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక క్షఉ చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను మళ్ళీ ప్రస్తావిస్తుంది. ఇది 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' దార్శనికతకు సాక్షియంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్ లో పోస్ట్ చేశారు కిషన్ రెడ్డి. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుంది.

## తిరుమల బ్రహ్మోత్సవాలకు

# శ్రీకారం



వెల్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలోని పలు ప్రాంతాలను విద్యుద్దీపాల అలంకరణలతో కళ్లుమిరిమిట్లు- గొలిపేలా తీర్చిదిద్దారు. పూల అలంకరణలు ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలను నేరుగా తిలకించేందుకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# పీఎం మోడీ విజన్ ఆఫ్ భారత్ 2025 అవార్డుకు ఎంపికైన కంబాల శివలీల.

గుర్రంపోడు:సెప్టెంబర్ 23(పద్మక్రాంతి ప్రతినిధి)




నల్లగొండ జిల్లా కనగల్లు మండల కేంద్రానికి చెందిన కంబాల శివ లీల ఫౌండేషన్ చైర్మన్,మదర్ తెరిసా అవార్డు గ్రహీత కంబాల శివలీల మనం ఫౌండేషన్ వారి పీఎం మోడీ విజన్ ఆఫ్ భారత్ 2025 అవార్డుకు ఎంపికయ్యారు. గత కొన్ని సంవత్సరాలుగా కంబాల శివలీల నిర్వహిస్తున్న వివిధ రకాల సామాజిక సేవలను గుర్తించి మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి సెప్టెంబర్ 17వ తేదీ భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా శివలీలకు ఈ అవార్డును ప్రకటించారు.ఈ సందర్భంగా శివలీల మాట్లాడుతూ.. తాను చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి తనకు ఈ అవార్డును ప్రకటించిన మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ అవార్డుకు ఎంపికైనందుకు కంబాల శివలీలను పలువురు అభినందించారు.

# ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ నిధులను వెంటనే విడుదల చేయాలి.

- ఎన్.హెచ్.ఆర్.సి జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్.

కొమరం భీమ్ ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23,(పద్మక్రాంతి ప్రతినిధి):



ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని, ఐటిడిఎ పీవో కుష్బూ గుప్తా ని ఎన్.హెచ్.ఆర్.సి జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ కొమరం భీమ్ ఆసిఫాబాద్ పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మరణించిన పశువులకు (ఎద్దులు,ఆవులు, మేకలు,గొర్రెలు.) ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ నిధుల ద్వారా అందే నష్ట పరిహారం కొరకు జిల్లా వ్యాప్తంగా అనేక మంది పేద గిరిజన రైతులు 6 నెలలుగా ఎదురుచూస్తూ ఉన్నారు అని అన్నారు.రైతులు ఫోన్ ద్వారా తమ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువచ్చారని అన్నారు. ఐటిడిఎ లో నష్ట పరిహారం కొరకు దరఖాస్తు చేసుకొని, నెలల తరబడి వారి బ్యాంకు ఖాతాల్లో నిధులను జమ చేయకుండా జాప్యం చేయడం సరికాదని అన్నారు. ఈ విషయం పై ఐటిడిఎ పీవో తక్షణమే స్పందించి మరణించిన పశువుల నష్ట పరిహారం రైతులకు చెల్లించి, ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


## తెలంగాణ రాష్ట్ర సీనియర్ సెపక్ తక్రా పోటీలో ఉమ్మడి ఆదిలాబాద్ పురుషుల జట్టు కు రెండవ స్థానం



రెబ్బెన, సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి):

ఈ. నెల 20 నుండి 22 వరకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వనపర్తి లో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా పోటీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషుల జట్టు సిల్వర్ మెడల్ సాధించినదని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్గ-నైజషన్ సెక్రటరీ కుమ్మరి.మల్లేష్ తెలిపారు. ఫైనల్ మ్యాచ్ లో హైదరాబాద్ జట్టు తో హెూరా హెూరి పోటీలో 15-14,15-13,తేడాతో సిల్వర్ మెడల్ సాధించింది.ఈ గెలిచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెపక్ తక్రా పురుషుల జట్టు ను తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ చీఫ్ పాట్రాన్. ఆర్. నారాయణ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ బాల్ బాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి. ఎస్ తిరుపతి, తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంయుక్త కార్యదర్శి. పి. శిరీష, తెలంగాణ సెపక్ తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్. కె భాస్కర్, ఆర్ రామకృష్ణ, పి. సాంబయ్య షార్ప్ స్టార్ బాల్ బాడ్మింటన్ అధ్యక్షులు. వి. మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి. ఎమ్. వెంకటేశ్వర్లు కోశాధికారి యూ. శంకర్. సీనియర్ క్రీడాకారులు. రెడ్డి. సతీష్,అనిల్ గౌడ్, జి. శ్రీధర్ అభినందనలు తెలిపారు.

## చౌదర్పల్లి లో లింగాకర్షక బుట్టల పంపిణీ




యాచారం,సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి ):

మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో సహాయక మొక్కల సంరక్షణ అధికారి బసవన్నప్ప పర్యవేక్షణలో రైతు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బసవన్నప్ప మాట్లాడుతూ... టమాటా దిగుబడుల పై అవగాహన కలిపించారు, ట్రైకోడర్మా విరిడి, సుడోమోనస్, వయోఫెస్ట్ సైడ్, ట్రైకో కార్డ్స్ ఉపయోగాలు వివరించారు. అనంతరం మొక్కల సంరక్షణ అధికారి వెంకటరెడ్డి, ఎన్ పి ఎస్ఎస్ అనే మొబైల్ యాప్ గురించి వివరించారు. దీని ఉపయోగంతో పురుగు, తెగుళ్లను ఎలా గుర్తించాలో రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో మొక్కల సంరక్షణ సహాయక అధికారి ఉదయ్ శంకర్ పాల్గొని, పురుగు ఉనికి గుర్తించి, పురుగు ఉధృతి నివారణ కోసం లింగాకర్షక బుట్టల వాడకాన్ని రైతులకు తెలిపారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసా-య విస్తరణ అధికారి రాధా, గ్రామ రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిబుల్ డ్రైవింగ్,మైనర్ డ్రైవింగ్ పై కఠిన చర్యలు.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్.**



కొమరం భీమ్ ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23,(పద్మక్రాంతి ప్రతినిధి ):

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్,పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, మైనర్ వాహనం నడిపి పట్టుబడిన సందర్భాల్లో వాహన యజమాని పై కూడా కేసు నమోదు చేయబడుతుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ హెచ్చరించారు. వాహన యజమానులు మైనర్ వ్యక్తికి వాహనం ఇవ్వరాదని, మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. ఈ ప్రమాదాలు వాహన యజమాని, ఇతర వ్యక్తులకు కూడా నష్టం కలిగించగలరని అన్నారు. కావున మైనర్లకు వాహనం ఇవ్వరాదని ఎస్పి సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం,నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం, నంబర్ ప్లేట్ దాచడం లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం,ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా శబ్ద కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. కొందరు వాహనదారులు నంబర్ గుర్తించలేని ఫాన్సీ డిజైన్ లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. వీలైనంత త్వరగా అన్ని వాహనాల నంబర్ ప్లేట్లను నిబంధనలకు అనుగుణంగా సరిగ్గా ఏర్పాటు చేయాలని హెచ్చరించారు. లేకపోతే వాహనదారులపై చీటింగ్ కేసులు నమోదు చేయబడతాయని అన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని తెలిపారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు ఉపయోగించి చైన్ స్నాచింగ్ ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉన్నందున, నిరంతర తనిఖీలు జిల్లా పోలీస్ శాఖ చేపడుతుందని అన్నారు. జిల్లా పరిధిలోని ప్రజలు పోలీస్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

# జాతీయ స్థాయి సీనియర్, సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపిక అయినా గోలేటి క్రీడాకారులు





రెబ్బెన, సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి):



ఈ నెల 24 నుండి 28 తమిళనాడు రాష్ట్ర ము దీండిగల్ బి ఎస్ ఎన్ ఏ కాలేజీ లో జరుగు 71వ సీనియర్ జాతీయ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు గోలేటి కి చెందిన పురుషుల జట్టు కు కె. సిద్దార్థ్ రాజ్, మహిళా జట్టు కు ఏ స్వప్న, కె. అంజలి ఎంపిక అయ్యారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళ బాల్ బాడ్మింటన్ జట్టు కు ఆత్రం. స్వప్న కెప్టెన్ గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జాతీయ సా-ధయి సబ్ జూనియర్ నేషనల్ బాల్ బాడ్మింటన్ పోటీలకు గోలేటి నుండి బాలుర జట్టు సి. ఎచ్. వరుణ్, సి ఎచ్.. నిఖిల్, బాలికల జట్టు నుండి ఎమ్. సహస్ర ఈ ఎంపిక అయ్యారు. ఈ జాతీయ స్థాయి సబ్ జూనియర్ నేషనల్ కూడా తమిళనాడు రాష్ట్ర ము దీండిఘల్ లో ఈ టోర్నమెంట్ ఈ నెల 24 నుండి 28 వరకు జరుగుతాయి. ఈ క్రీడాకారులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బాడ్మింటన్ అధ్యక్షులు. కొత్తపల్లి శ్రీనివాస్, చీఫ్ పట్రాన్. ఆర్ నారాయణ రెడ్డి, ట్రేజార్ యూ. శంకర్, తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి. ఆర్ శ్రీనివాస్ రెడ్డి, షార్ప్ స్టార్ బాల్ బాడ్మింటన్ అధ్యక్షులు వి. మహేందర్ రెడ్ట్, ప్రధాన కార్యదర్శి ఎమ్ వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఎల్ హరిలాల్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్. కె.భాస్కర్, ఎమ్ చందర్, ఆర్ రామకృష్ణ, కె మల్లేష్. వి సతీష్, జి మల్లేష్ రెడ్డిసతీష్, లింగం రెడ్డి, సదానందం, చిన్ని తౌఫిక్ అహ్మద్, అభినందనలు తెలిపారు.

# బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్.




పటాన్ చేరు, సెప్టెంబర్ 23,(పద్మ క్రాంతి):

పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై ఈనెల 29వ తేదీ సోమవారం సాయంత్రం నిర్వహించబోయే సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి సాకి చెరువు కట్టపై బతుకమ్మ పండగ ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈసారి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలతోపాటు.. ప్రముఖ జానపద సినీ గేయ కళాకారులచే సంస్కృతిక విభావరి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. బతుకమ్మ ఘాటు వద్ద మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిహెచ్ఎంసి సిబ్బందితోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యుత్ దీపాలు, తాగునీరు, అత్యవసర వైద్య సిబ్బందితో పాటు పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ పండుగను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్, డి ఈ కృష్ణవేణి, ఏ ఈ శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# 57 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్. .




పటాన్ చేరు,సెప్టెంబర్ 23,(పద్మ క్రాంతి):

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లకు సంబంధించిన 125 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 57 లక్షల 74 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సహాయం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు.

# అమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి..

– నీలం మధు ముదిరాజ్..






పటాన్ చేరు,సెప్టెంబర్ 23, (పద్మ క్రాంతి):

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి చిట్కుల్ గ్రామంలోని తన ఇంటి ఆవరణలో గత 18సంవత్సరాల నుండి నెలకొల్పుతున్న దుర్గమాత సన్నిధిలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రులను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. లోక శాంతి కోసం దేవి శరన్నవరాత్రులలో తొమ్మిది రోజులు తొమ్మిది రూపాలుగా అమ్మను పూజించి ఆరాధిస్తారని తెలిపారు. అమ్మలగన్న మాయమ్మ దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# రెండవ రోజు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు..

పద్మక్రాంతి, సెప్టెంబర్ 23,(కల్వకుర్తి ప్రతినిధి):



వంగూరు మండల కేంద్రంలోని శ్రీ గెల్వాలాంబ మాత ఆలయ ఆవరణలో ప్రతిష్టించిన దుర్గామాత నవరాత్రుల సందర్భంగా రెండవ రోజు పూజలు నిర్వహించారు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి చెల్లమల్ల వెంకటయ్య గౌడ్, చెల్లమల్ల గేల్వయ్య గౌడ్,బాధమోని శ్రీనుగౌడ్, చల్లమల్ల



రమేష్ గౌడ్ గార్ల దంపతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గ్రామప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తొలి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా కోట్ల వెంకటరమణ నియామకం..

పద్మక్రాంతి, సెప్టెంబర్23, ( కల్వకుర్తి ప్రతినిధి ):



కల్వకుర్తి సీనియర్ కోర్టులో తొలి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా కోట్ల వెంకటరమణను నియమించారు కల్వకుర్తి కోర్టులో గత 26 సంవత్సరాలుగా న్యాయవాది వృత్తి చేపట్టి ఈ ప్రాంత వాసులకు సుపరిచితుడైన వెంకటరమణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పెషల్ పి పి గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తరుడు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ ఉత్తరుల మేరకు ఆయనను పబ్లిక్ ఫస్ట్ మూడు సంవత్సరాల సేవ అందించనున్నారు తనకు న్యాయవాది వృత్తిలో 26 సంవత్సరాల అనుభవం ఉందని తాను వృత్తిపరంగా సమర్థమంగా నిర్వహించడం వలన ప్రభుత్వం తనకి అవకాశం కల్పించిందన్నారు పబ్లిక్ ప్యాసిక్యూటర్ గా తనను నియమించడానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ సర్పంచ్ ఆనంద్, గార్లకు ఆయన కృతజ్ఞులు తెలియజేశారు ఈ సందర్భంగా కోర్టు న్యాయవాదులు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# తెలంగాణ శ్రామిక మహిళా రాష్ట్ర కన్వెన్షన్ను జయప్రదం చేయాలి.

- రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ భూపాల్.

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, సెప్టెంబర్ 23,(పద్మక్రాంతి ప్రతినిధి):**


కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్ నగర్ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో శ్రామిక మహిళా సమన్వయ తెలంగాణ స్టేట్ కన్వెన్షన్ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన కామ్రేడ్ భూపాల్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వెన్షన్ మొట్టమొదటిసారిగా మన కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్నగర్ పట్టణంలో సంతోష్ ఫంక్షన్ హాల్ నందు అక్టోబర్ 5, 6 తేదీలలో జరగనున్నట్టుగా తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి 1,000 మంది మహిళా ఉద్యమ నాయకులు, ప్రతినిధులుగా హాజరవుతున్నారని అన్నారు. రాష్ట్రంలో శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ భద్రత కోసం చేయాల్సిన భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించుటకు మొదటి రోజు బహిరంగ సభ, ప్రతినిధులకు భోజనాలు, వసతి ఏర్పాట్లతో పాటు భవిష్యత్తు ఉద్యమ అవసరాల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, కార్మిక శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. నేడు అన్ని రంగాలలో మహిళలు ముందుంటున్నారు అని అన్నారు. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు, మరోపక్క కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు అని అన్నారు. కానీ ఎక్కడికి వెళ్ళినా, ఏ స్థాయిలో ఉన్నా మహిళలపై వేధింపులు, వివక్ష, అవమానాలు తప్పడం లేదు అని అన్నారు. ఉపాధి కల్పనలో మహిళలు అసమానతలు ఎదుర్కొంటున్నారు అని అన్నారు. భారతదేశంలో శ్రామిక మహిళా శక్తి భాగస్వామ్య



రేటు కేవలం 28.4% మాత్రమే ఉంది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ సంఖ్య ఇంకా తక్కువగా ఉంది అని అన్నారు. 90% మంది మహిళలు అసంఘటితరంగంలో పనిచేస్తున్నారు అని అన్నారు. వారికి సామాజిక భద్రత, రక్షణ లేదు అని అన్నారు. సమాన వేతనాలు కూడా లభించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు,ఎస్ పి ఎం పేపర్ మిల్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కూశన రాజన్న, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, శ్రామికమహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ త్రివేణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, ముంజం ఆనంద్ కుమార్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గేడం టికానంద్, గొడిసెల కార్తీక్,తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నేర్పల్లి అశోక్ ,కొరెంగ మాలశ్రీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి,ధ్వ ఇళ్ల కార్యదర్శి దుర్గా అనిత తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**పద్మ క్రాంతి, సెప్టెంబర్ 23, ( సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ):**

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహా నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని(చెక్కులు) టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. సంగారెడ్డి లో జరిగిన కార్యక్రమంలో 109 మంది లబ్దిదారులకు 55 లక్షల రూపాయల విలువగల చెక్కులను అందచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు యేటా సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు, సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రఘు గౌడ్, కంది మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్, సిద్దన్న, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్, వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూములు లాకుంటే సహించేది లేదు...

## త్రిబుల్ ఆర్ బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్..



**పద్మక్రాంతి, సెప్టెంబర్ 23, (కల్వకుర్తి ప్రతినిధి):**

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రైతాంగానికి కష్టాలు ప్రారంభమైనాయి రైతుల పాలిట రాక్షస ప్రభుత్వంగా మారింది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న సన్నా చిన్నకారు రైతుల పొట్టలుకొట్టి కేవలం ఆ వృత్తి పైన ఆధారపడి కాయకష్టం చేసుకుని చాలీచాలని బ్రతుకులతో కుటుంబాలను పోషించుకోలేక పిల్లలను చదివించుకోలేక అన్నము రామచంద్రా అని బతుకు ఈడ్చుకోస్తున్న అన్నదాతల భూములను అక్రమంగా రైతుల ఆమోదం లేకుండా అన్యాయంగా ప్రభుత్వ బలగాలతో బలవంతంగా లాక్కొని అదేక పథకాల పేరుతో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు. త్రిబుల్ ఆర్ రోడ్ 765 గ్రిడ్ అని వేలాది ఎకరాలు కొల్లగొట్టి ప్రభుత్వం లో ఉన్న పెద్దలకు లబ్ధి కలిగించడానికి ఈ రేవంత్ రెడ్డి గారి కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజా స్వామీకంగా ఒక దుర్మార్గ పాలన కొనసాగిస్తుంది కల్వకుర్తి నియోజకవర్గంలో కడ్తాల్,మాడ్గల్,ఆమనగల్, తలకొండపల్లి,మండలాలలో త్రిబుల్ ఆర్ నిర్మాణంలో గతంలో నిర్ణయించిన అలైన్మెంట్ ను మార్చుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్ద నాయకుల రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులకు లబ్ధి చేకూర్చే విధంగా కనీస ప్రామాణికాలు నిబంధనలు పాటించకుండా చిన్న సన్న కారు పేద రైతుల భూములను కొల్లగొట్టి వారి జీవనోపాధికి భంగం కలిగిస్తూ కుటుంబం బజారున నిర్లాక్షణంగా పడవేయడం జరుగుతుంది ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చెప్పినప్పటికీ ఈ ప్రభుత్వం పెద్దల పక్షాననే ఉంటూ వారికి లబ్ధి చేకూర్చడానికి పేదల పొట్ట కొట్టడానికి కంకణం కట్టుకుంటుంది

ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం పై తేదీ 25-గురువారం మధ్యాహ్నం 1.గంటలకు తెలంగాణ భవన్ హైదరాబాద్ లో పై నాలుగు మండలాల బాధిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనైనది ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి శ్రీకల్వకుంట్ల రామారావు, మాజీ సిద్దిపేట శాసనసభ్యులు టి హరీష్ రావు,హాజరై బాధితుల పక్షాన తదుపరి కార్యాచరణ నిర్వహించనున్నారు. కావున బాధిత రైతులు కార్యక్రమంలో పాల్గొనగలరని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు.

## సింగరేణి కోల్ ట్రాన్స్పోర్ట్ లారీ డ్రైవర్లు, క్లీనర్లకు లాభాల వాటా వెంటనే చెల్లించాలి

- ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్



**రెబ్బెన, సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి):**

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి,యాజమాన్యం ప్రకటించిన లాభాల్లో వాటా రూ. 5,500 అర్హులైన లారీ డ్రైవర్లకు క్లీనర్లకు వెంటనే చెల్లించాలని ఏఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రోజున జనరల్ మేనేజర్ కార్యాలయంలో డ్రైవర్లతో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా అర్హులైన చాలామందికి లాభాల్లో వాటా చెల్లించలేదని,దీనివలన కార్మికులు ఆర్థికంగా నష్టపోయారని గుర్తు చేశారు. ఈసారి అర్హులైన లారీ డ్రైవర్లకు క్లీనర్లకు అందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలారీస్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు లచ్చన్న, కార్యదర్శి తిరుపతి, నాయకులు నర్సయ్య,శంకర్, మనోహర్, రవి, గంగారాం, సతీష్, చంద్రకాంత్, బుచ్చన్న, రమేష్, లింగాన్న, ప్రభాకర్,మూర్తి, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా భవనంను ప్రారంభించిన కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి








**రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 23 (పద్మక్రాంతి):**

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణాపూర్ పట్టణంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన మెప్మా భవన నిర్మాణాన్ని మంగళవారం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేదవాళ్లకు ఇందిరమ్మ ఇల్లను అందజేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళ శక్తి సంఘాలకు 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేశామని సూచించారు. 2004లో మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలను దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అందజేశారని గుర్తు చేశారు. ఉచిత బస్ పథకానికి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం పదివేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రి తహసిల్దార్ సతీష్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు,మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, మాజీ కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్జెల చెన్నారెడ్డిని పరామర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి.



**గుర్రంపోడు:సెప్టెంబర్ 23(పద్మక్రాంతి ప్రతినిధి)**

గుర్రంపోడు మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు గజ్జెల చెన్నారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సను పొందిన అనంతరం హైదరాబాదులోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారన్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి మంగళవారం హైదరాబాదులోని గజ్జెల చెన్నారెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మునుకుంట్ల రాజేష్ రెడ్డి ఉన్నారు.

# క్రీడలతో యువతలో ఉత్సాహం..






- కల్వకుర్తి సీఐ.నాగార్జున..
- ఎస్ఐ మాధవరెడ్డి..

**పద్మ క్రాంతి, సెప్టెంబర్ 23,**

**( కల్వకుర్తి ప్రతినిధి ):**

కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం అలాగే మైభారత్ జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు స్థానిక జెపి నగర్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు ఇంటర్ కళాశాల లో నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు కబడ్డీ,వాలీబాల్,ఖోఖో,పరుగుపందెం పోటీలు నిర్వహించారు పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి సీఐ.నాగార్జున,ఎస్.ఐ మాధవ రెడ్డి,జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కోట నాయక్,పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు సి.ఐ నాగార్జున మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యం అని తెలిపారు. జిల్లా యువజన అధికారి కోటా నాయక్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వలన కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం పై వివరణ,మై భారత్ పోర్టల్ లో యువత రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు . ఎస్.ఐ మాధవరెడ్డి మాట్లాడుతూ మద్యం,డ్రగ్స్ కు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దు అని మాదకద్రవ్యాలను స్వీకరించే వారి పై చట్టరీత్యా కఠిన శిక్షలు ఉంటాయి అని నేరాల పై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్,కళాశాల ప్రిన్సిపల్ అంబయ్య,వైస్ ప్రిన్సిపాల్ డా. సుధాకర్,సేవా బృందం సభ్యులు హర్షిత్,కళాశాల లెక్చరర్స్,విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## రెండవ రోజు గాయత్రి దేవిగా అమ్మవారి అవతారం.

**గుర్రంపోడు:సెప్టెంబర్ 23(పద్మక్రాంతి ప్రతినిధి)**



గుర్రంపోడు మండలం చామలేడు గ్రామంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం గాయత్రీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించారు. రెండవ రోజు నవరాత్రి వేడుకలలో భాగంగా అమ్మవారిని చక్కగా పూలతో అలంకరించి,ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేశారు. గ్రామంలోని భక్తాదులు పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని వారు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగరాజు,శ్రీ దుర్గా దేవి కమిటీ సభ్యులు, ప్రవీణ్,నవీన్, సురేష్, వంశీ, నాగరాజు,శివ, కిషోర్, సిద్దు, నరేష్, శ్రీకాంత్, అనిల్,పండు,మహేష్, గోపి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## కల్వకుర్తి పి డి ఎస్ యు నూతన కమిటీ ఎన్నిక...



**పద్మక్రాంతి, సెప్టెంబర్ 23, ( కల్వకుర్తి ప్రతినిధి ):**

పి డి ఎస్ యు ఆధ్వర్యంలో కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో టౌన్ కమిటీ పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడిగా ఎన్. కార్తీక్ హుస్నాబాద్ ఐ ఐ టి విద్యార్థి, ప్రధాన కార్యదర్శిగా అనిల్ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి,ఉపాధ్యక్షుడిగా అరవింద్, సహాయ కార్యదర్శిగా విశాంత్,సభ్యులుగా ఆదిత్య శివ, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు.

## ప్రజలు మరియు భూగోళానికి ఆయుర్వేదం

## –డాక్టర్ మనోహర్ రెడ్డి,




**పాపన్నపేట. సెప్టెంబర్ 23,(పద్మక్రాంతి)**

తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా లో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా మెదక్ జూనియర్ కళాశాల గర్ల్స్ శిబిరంలో పాల్గొని ఆయుర్వేద ఔషధ మొక్కల గురించి ఆహారం నియమాల గురించి యోగా వల్ల ఉపయోగాల గురించి తెలుసుకున్నారు



అనంతరం డాక్టర్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా నాడు మన వైద్య శిబిరంలో విద్యార్థులతో పాటు ప్రజలు కూడా 78 మంది శిబిరాన్ని ఉపయోగించుకోవడం ఆనందదాయకంగా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో డిస్టిక్ ప్రోగ్రాం మేనేజర్ రవి చింతల తోపాటు డాక్టర్స్ లక్ష్మీనారాయణ డాక్టర్ రజిని డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ మధుమిత డాక్టర్ విజిత డాక్టర్ లావణ్య ఫార్మసిస్ట్ కిష్టారెడ్డి యూసుఫ్ ఎంఎన్ఓ జాఫర్ పెంటయ్య యోగ ఇన్స్ట్రక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లో ఇంటి భద్రతపై జాగ్రత్తలు పాటించండి:ఎస్సై పసుపులేటి మధు

**గుర్రంపోడు:సెప్టెంబర్ 23(పద్మక్రాంతి ప్రతినిధి)**



గుర్రంపోడు మండల ప్రజలు దసరా పండుగ సందర్భంగా ఇంటి నుండి బయటకు వెళ్ళే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని గుర్రంపోడు ఎస్సై పసుపులేటి మధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.పండుగ సెలవుల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ప్రజలు పోలీస్ విభాగం సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.ఇంటి తాళాలు వేసి బయలుదేరే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని,డోర్లు,కిటికీలు,ఫ్యాన్, లైట్స్ పూర్తిగా చెక్ చేసుకోవాలని సూచించారు.ఇంట్లో లేని సమయంలో వాహనాలపై నోటీసులు పెట్టవద్దని,పొరుగు వారికి ఇంటి బయటకు వెళ్ళిన సమాచారం తెలియజేయాలని తెలిపారు.ఇళ్లలో సెంట్రల్ లాకింగ్ సిస్టమ్,సీసీ కెమెరాలు, అలారంలు అమర్చుకోవడం ద్వారా భద్రత కట్టుదిట్టం చేయవచ్చని ఎస్సై మధు తెలిపారు.అలాగే డీవీఆర్ రికార్డింగ్ పర్యవేక్షణలో ఉండాలని, బయటకు వెళ్ళిన విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయవద్దని సూచించారు.కొత్త వ్యక్తులు ఇంటి వద్ద లేదా కాలనీల్లో తిరుగుతున్నట్లయితే వెంటనే 100 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై పసుపులేటి మధు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రెండవ రోజు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు..



**మిడ్జిల్, సెప్టెంబర్ 23,( పద్మక్రాంతి ప్రతినిధి):**

మిడ్జిల్ మండలలో వాడియాల గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గామాత నవరాత్రుల సందర్భంగా రెండవ రోజు పూజలు నిర్వహించారు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గ్రామప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ 24 డివిజన్లో ఐమాక్స్ లైట్లు ప్రారంభోత్సవం

- **ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మేయర్ అమర్ సింగ్,మాజీ కార్పొరేటర్ అనంతరెడ్డి**
- **10 లక్షల నిధులతో డివిజన్ పరిధిలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు**

**మేడిపల్లి,సెప్టెంబర్ 23,పద్మక్రాంతి:**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్ పరిధిలోని ఓం విహార్ కాలనీ, ప్రశాంత్ నగర్ కాలనీ,మారుతి నగర్, శ్రీ సాయి నగర్ కాలనీలలో స-ుమారు10 లక్షల నిధులతో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్ల ప్రారంభోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ అమర్ సింగ్,స్థానిక మాజీ కార్పొరేటర్ యంపల్ల అనంతరెడ్డి పాల్గొని ఐమాక్స్ లైట్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అనంతరెడ్డి మాట్లాడుతూ 24వ డివిజన్ అన్ని రంగాలలో ఆదర్శవంతంగా అభివృద్ధి చెందిందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సీసీ రోడ్లు,డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని, కార్పొరేషన్ లో ఏ డివిజన్లో లేని విధంగా పబ్లిక్ పార్కులను అత్యంత సుందరంగా అభివృద్ధి చేశామని,అభివృద్ధిలో భాగంగా అన్ని కాలనీల కూడళ్ల వద్ద ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అన్నారు.అదేవిధంగా కమిషనర్ త్రిలేశ్వరరావు,మాజీ మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు,కాలనీవాసులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కేసులలో కన్వెక్షన్ శాతాన్ని పెంచుటకు

# క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలి.

## వికారాబాద్ జిల్లా ఎస్పీ. కె. నారాయణ రెడ్డి.

**వికారాబాద్, సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి):**



వికారాబాద్ జిల్లా ఎస్పి కె.నారాయణ రెడ్డి జిల్లా పోలీస్ అధికారులందరితో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముందుగా జిల్లాలో నమోదైన కేసుల వివరాలను, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పి మాట్లాడుతూ.. ముఖ్యంగా లాంగ్ పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేయాలని, అట్టి కేసులను డిఎస్పి ,ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు, నేర నియంత్రణలో, నేర పరిశోదనలో సిసి కెమెరాల ప్రాధాన్యత చాలా వరకు ఉంటుంది. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజలకు అవగాహనా కల్పించి సిసి కెమెరాల ఏర్పాటు చేయాలనీ చెప్పారు. పోక్సో కేసులలో ఇన్వెస్ట్ గేషన్వెంటనే పూర్తి చేసి చార్జ్ షీట్ వేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వ్యక్తులకు రూమ్లు అద్దెకు ఇచ్చే ముందు ఇంటి యజమానులు వారి అడ్రెస్లను పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్. ఫోన్ నంబర్స్ మొదలయిన వాటితో నిర్ధారించుకోవాలని తెలిపారు. ఎన్‌బిడబల్యూ లు పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. రౌడీ షీటర్స్ పైన ప్రత్యేక దృష్టి పెట్టి వారికి కౌన్సెలింగ్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పి తెలిపారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్ కేసులలో నిందితులకు తప్పని సరిగా శిక్ష పడే విధంగా పోలీస్ అధికారులు ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు.



**పోలీస్ అధికారులకు శిక్షణ.**

జిల్లాలో నమోదైన కేసులలో శాతన్ని పెంపొదించుటకు మరియు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేయుటకు పి .రాములు పిపి (రిటైర్డ్) తో జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌హెచ్ఓ లకు, కోర్ట్ డ్యూటి ఆఫీసర్లకు ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈసెమినార్లో పోలీస్ అధికారులకు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేసే విధానం పైన కేసులలో కన్వెక్షన్ శాతన్ని పెంచుటకు చేయాల్సిన విషయాలపైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీలు బి.రాములు నాయక్ తాండూర్, పరిగి, వికారాబాద్ డిఎస్పి ,జిల్లా ఇన్స్పెక్టర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అధికారులు, జిల్లా ఎస్ఐ అధికారులు,ఆర్ఐ లు,ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



## ఆయుర్వేదిక్ ఆరోగ్య శిబిరానికి

# మంచి స్పందన.


- **తుక్కుగూడ మున్సిపల్ లో మెగా**
- **10వ జాతీయ ఆయుర్వేదిక్ హెల్త్ క్యాంపు.**
- **తుక్కుగూడ మున్సిపల్ ప్రత్యేక అధికారి బోనగిరి శ్రీనివాస్, కమీషనర్ వాణి రెడ్డి.**

**మహేశ్వరం, సెప్టెంబర్ 24 (పద్మక్రాంతి ప్రతినిధి):**

మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపల్ లో ఆయుర్వేదిక్ ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించిందని తుక్కుగూడ మున్సిపల్ ప్రత్యేక అధికారి బోనగిరి శ్రీనివాస్, కమీషనర్ వాణి రెడ్డి లు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద 10 వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య కేంద్రం నిర్వహించారు. ఈ శిబిరానికి రంగారెడ్డి జిల్లా ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి నాయక్ పరిశీలనలో విజయవంతమైంది. ఈ క్యాంపులో దాదాపు 300 మందికి పైగా రోగులు పరీక్షలు చేయించుకున్నారు. వారికి బీపీ, షుగర్ దీర్ఘకాలిక రోగులకు అవసరమైన ఆయుర్వేదిక్ మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ మహిపాల్, మేనేజర్ సౌమిక్, ఆర్ఐ మల్లేష్, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి డా. జయశ్రీ, మంఖాల్ డాక్టర్ సూర్యనాయక్, డా. జయ ప్రకాష్, డా. ఉమారాణి, డా. శృతి, డా. శశికళ ఆశా వర్కర్లు, పురపాలక సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.




## గోలేటిలో దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు దాదా



**రెబ్బెన, సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి):**

శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ గోలేటి టౌన్షిప్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గామాత అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ గారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్ తో కలిసి మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రజలు అమ్మవారి దయతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కాంక్షించారు. అమ్మవారి నవరాత్రి నిర్వాహకులు దాసరి శ్రీనివాస్, దుర్గం రవీందర్, అడప విమల, పూదరి సాయి, పర్వతి సాయి, సళ్ళ మహేష్, వరదల సంతోష్,దుర్గం తిరుపతి, రమేష్, పథం అరుణ్, వర్ధల రాకేష్, పస్తం రాజు, దుర్గం సాయి, పస్తం శ్రీనివాస్, రాజ్ కుమార్, రెడ్డి సంజీవ్, శరణ్, సాయి రుతిక్, లక్కీ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణకు మాజీ మంత్రి , ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం.



**మహేశ్వరం,సెప్టెంబర్ 23, (పద్మక్రాంతి ప్రతినిధి):**

ఈనెల 26, 27 తేదీలలో మహేశ్వరం నియోజకవర్గం కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరు కావాలని మహేశ్వరం పద్మశాలి సంఘం నాయకులు, ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, పోతర్ల అంబయ్య యాదవ్, రాజు నాయక్, ఎస్ ఆనందం, సుధీర్, పద్మశాలి సంఘం నాయకులు ఎం నవీన్, పులిపాటి శ్రీనివాస్, కౌకుంట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

## కెసిఆర్ ఇచ్చిన నిధులతోనే

# బీర్కూర్ అభివృద్ధి

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



**నిజామాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే బీర్కూర్‌ను అభివృద్ధి చేశానని ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గతంలో ఎన్నో విధాలుగా నియోజకవర్గానికి నిధులు తీసుకుని వచ్చానని అన్నారు. బీర్కూర్ ఎస్సీ వాడలో రూ.65 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు- చేసిన సభలో మాట్లాడారు. సొంత స్థలాలు ఉన్నవారు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు బోనస్ ఇచ్చే ఆలోచనలో ఉందని చెప్పారు. ఆగ్రో ఛైర్మన్ కాసుల బాల్ రాజ్, సొసైటీ- ఇన్‌ఛార్జి ఛైర్మన్ రాములు, శంకర్, శశికాంత్, రాములు, కాంతు రెడ్డి, బస్వరాజ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అభ్యున్నతికి కృషి

- కాకా నుంచి నేటి వరకు ప్రత్యేక శ్రద్ధ: వివేక్



**పెద్దపల్లి,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

సింగరేణి సంస్థ లాభాల్లో ఉండడానికి దివంగత నేత, తన తండ్రి కాకా వెంకటస్వామి కారమణని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కాకా నుంచి తన తనయుడి వరకు సింగరేణి ఉన్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలోని శాంతి నగర్ ఏరియాలో ఉన్న దుర్గా మాత మండపంలో మంత్రి వివేక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌కి ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. 1995లో సింగరేణి నష్టాల్లోకి వెళితే ఆనాటి కేంద్ర మంత్రి, తన తండ్రి కాకా వెంకటస్వామి ప్రధానిని ఒప్పించి సింగరేణికి రూ.10 వేల కోట్లు- సహకారం అందించారని గుర్తు చేశారు. ఇవాళ సింగరేణి లాభాల్లో ఉందంటే దానికి కారణం కాక వెంకటస్వామి అని అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం కాకా వెంకటస్వామి నుంచి తన కుమారుడు, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ వరకు కృషి చేస్తున్నారని చెప్పారు. తాను పెద్దపల్లి ఎంపీగా ఉన్న కాలంలో రామగుండం ఫెర్టిలైజర్ కంపెనీ మూతపడితే.. దానిని తెరిపించడం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.6 వేల కోట్ల ఆర్థిక సహాయం అందేలా చూశానని
గుర్తు చేశారు.

## బిజెపిలో చేరిన నటుడు వరుణ్ సందేశ్ తల్లి



**హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

సినీనటుడు వరుణ్ సందేశ్ తల్లి డాక్టర్ రమణి భాజపాలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆమెకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణి మాట్లాడుతూ సమాజసేవ చేయడం అంటే తనకు చాలా ఇష్టమన్నారు. హిందుత్వం అంటే తమ కుటుంబానికి ఇష్టమని.. అందుకే భాజపాలో చేరినట్లు- చెప్పారు. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# కామారెడ్డి వరద నష్టంపై రీ సర్వే చేయాలి



- సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన
- కేంద్రం ఇచ్చిన నిధులనే వాడుకుంటున్న రాష్ట్రం
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎంపి అర్వింద్

**నిజామాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

కామారెడ్డిలో వరద నష్టం అంచనాపై రీ సర్వే చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. కామారెడ్డిలో వరద నష్టానికి ఒక్క పైసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటోందని గుర్తుచేశారు. మాధవనగర్, మామిడిపల్లి, అర్సపల్లి రైల్వే బ్రిడ్జిల కోసం బీజేపీ ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మూడు ప్రాంతాల్లో ఆందోళనలు చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరద నష్టం నిధులను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర వేషాలు వేస్తోందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. మంగళవారం నిజామాబాద్‌లో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కామారెడ్డిలో వరద నష్టం ఇవ్వకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే చిల్లర వేషాలనూ కాంగ్రెస్ కూడా వేస్తోందని ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో టీ-పీసీసీ అధ్యక్షులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా పెండింగ్ పనులకు నిధులు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని.. ఆల్మట్టి పెంపుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని
వెల్లడించారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని దిశానిర్దేశం చేశారు.

# డిసిసి అధ్యక్షుల నియామకంపై కసరత్తు

## పరిశీలకులతో నివేదికలు సిద్ధం చేస్తున్న పార్టీ

**హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

తెలంగాణలో డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియను సీరియస్‌గా ప్రారంభించడానికి ముందుగా 22 మంది పరిశీలకులను కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ నియామక ప్రక్రియలో జిల్లా స్థాయి బాధ్యతలు పరిశీలకులకి అప్పగించబడ్డాయి. ప్రత్యేకంగా నియమించబడిన పరిశీలకులు ప్రతి జిల్లాలో డీసీసీ అధ్యక్షుల ఎంపికపై సూపర్ పవర్స్ కలిగి ఉంటారు. దీని ద్వారా నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, సమగ్రంగా జరుగుతుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. తెలంగాణలోని డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం పరిశీలకులు సీరియస్‌గా కసరత్తు చేస్తున్నారు. అన్ని నియామకాలు, నియమాలు కఠినంగా పరిశీలించి, అనవసర అడ్డంకులు లేకుండా అధ్యక్షులను ఎంచుకోవడం కోసం ఈ ప్రయత్నం జరుగుతోంది. పరీక్షల తర్వాత, పరిశీలకులు జిల్లా అధ్యక్షుల ఎంపికను ముగించి, ఆఐసిసి అధికారికంగా ప్రకటించనుంది. త్వరలోనే తెలంగాణలో ప్రతి జిల్లాకు డీసీసీ అధ్యక్షులు పూర్తి స్థాయిలో నియమించబడతారు. ఈ చర్య, కాంగ్రెస్ పార్టీలో లోకల్ లెవల్ నాయకత్వాన్ని పునర్నిర్మించడానికి, కేంద్రం , రాష్ట్ర నాయకత్వం మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడానికి కీలకంగా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# నెలల తరబడి పెండింగ్‌లో రేషన్ కమీషన్

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

నెలల తరబడి రేషన్ కమిషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు మండిపడ్డారు. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్ డీలర్లకు.. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటు-ంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణమని అన్నారు. రేషన్ డీలర్లు మంగళవారం నగరంలోని తన నివాసంలో హరీష్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతో పాటు- కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదని, ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు తప్ప చేతలులేని కోతల ప్రభుత్వం ఇది అని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని గుర్తు చేశారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను 900 నుంచి 1400 రూపాయలకు పెంచామని, ప్రభుత్వంపై 139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. 2014లో మెట్రిక్ టన్నుకు 200 రూపాయలుగా ఉన్న కమీషన్‌ను, 1400



రూపాయలకు పెంచామని, 17వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపామని అన్నారు. కమిషన్ చెల్లించడమే కాదు, కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామని చెప్పారు. రేషన్ డీలర్‌షిప్ వయో పరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంచామని అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని సైతం అమలు చేయకుండా రేషన్ డీలర్ల పాలిట శకునిలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబర్ కమిషన్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు- 5 వేల గౌరవ వేతనం, కమిషన్ పెంపు ప్రకటించాలని హరీష్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# జిఎస్టీపై ఎనిమిదేళ్లుగా దోపిడీ

- ఇప్పుడేమో సంబరాలా: పొన్నం ఆగ్రహం




**హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

జీఎస్టీ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశ ప్రజలను దోచుకునేందుకే నాడు జీఎస్టీని ఆయుధంగా వాడారని, వాళ్లే పన్నులు వేసి, వాళ్లే తగ్గించి, ఇప్పుడు వాళ్లే సంబురాలు చేసుకుంటున్నారని దీనిని మించిన మూర్ఖత్వం మరొకటి ఉండదని ఆయన దుయ్యబట్టారు. మంగళవారం గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ 8 ఏళ్లుగా జీఎస్టీ పేరుతో పేదల రక్తం తాగి ఇప్పుడు పేదలకు లబ్ధి చేసినట్టు- బిజెపి నాయకులు బిల్డప్ ఇస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. జీఎస్టీ తగ్గింపు అంత ఎన్నికల డ్రామా అని, ఇంకా జీఎస్టీ ఫలాలు పేదోడికి అందలేదన్నారు.

## జిఎస్టీతో ముందే వచ్చిన దసరా,దీపావళి

- కాంగ్రెస్ హయాంలో 28శాతంతో దోచుకున్నారు
- విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రఘునందన్



**విజయవాడ,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2025లో దసరా, దీపావళి పండుగలను జీఎస్టీ రూపంలో ముందుగానే తీసుకువచ్చారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఉద్ఘాటించారు. కొంతమంది తెలివి లేని వాళ్లు జీఎస్టీ గురించి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.
వాళ్లందరికీ మంచి బుద్ధి ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామిని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మీడియాతో ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడారు. అమ్మవారి ఆలయంలో దర్శన ఏర్పాట్లు- చాలా బాగున్నాయని వివరించారు. దసరా ఏర్పాట్లు బాగా చేసిన కలెక్టర్, ఆలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఆలయ కమిటీలు ఇంకా వేసినట్లు- లేదని, త్వరలో వేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు ఎంపీ రఘునందన్‌రావు. జీఎస్టీ రూపంలో గతంలో ప్రజలపై విపరీతమైన భారాలు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మండిపడ్డారు. గతంలో కాఫీ మీద కూడా జీఎస్టీ 28 శాతం ఉండేదని గుర్తుచేశారు. దేశ ప్రజల కోసం పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నిండు నూరేళ్ల ఆయుష్షు ఇవ్వాలని అమ్మవారిని కోరుకున్నానని పేర్కొన్నారు. 4 స్లాబులుగా ఉండే జీఎస్టీని 2 శ్లాబులుగా చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు.

## గోడకూలి తండ్రీకూతుళ్ల మృతి

**నిజామాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గోడ కూలి తండ్రి, కుమార్తె మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు-చేసుకుంది. ఇంటి పక్కనే ఉన్న రైస్‌మిల్ గోడ కూలి వీరు నివాసం ఉంటున్న రేకుల షెడ్డుపై పడింది. దీంతో షెడ్డులో నిద్రిస్తున్న ఇందూరు మహేష్ కుమార్, నెలల వయసు ఉన్న చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి తల్లి మహేశ్వరికి తీవ్ర గాయాలు కాగా.. స్థానిక ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రైస్‌మిల్ గోడ పూర్తిగా తడిసిపోయి కూలినట్లు స్థానికులు చెబుతున్నారు.

## పిసి ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయండి

- హైకోర్టులో సవాల్ చేసిన ఐఎఎస్ స్మితా సబర్వాల్



**హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు- సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీ-వల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్‌తోపాటు- అక్టోబరు 7కి హైకోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# గ్రూప్–1 రద్దుపై మరో అప్పీల్

- విచారణకు స్వీకరించిన సిజె ధర్మాసనం

**హైదరాబాద్,సెప్టెంబర్23(పద్మక్రాంతి):**

తెలంగాణలో గ్రూప్–1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను రద్దు చేస్తూ ఇటీవల వెలువడిన తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలైంది. గ్రూప్–1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి ఒకరు ఈ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సదరు అభ్యర్థి అప్పీల్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది. టీజీపీఎస్సీ కూడా అప్పీల్ దాఖలు చేశారని న్యాయవాది పేర్కొనగా.. ఈ రెండు పిటిషన్లు కలిపి బుధవారం విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. గ్రూప్–1 మెయిన్ పత్రాల పునర్ మూల్యాంకనం చేయాలంటూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. టీ–జీపీఎస్సీ విడుదల చేసిన ర్యాంకుల లిస్టు రద్దు చేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. ఎనిమిది నెలల్లో మెయిన్స్ పత్రాల పునర్‌మూల్యాంకనం చేయాలని టీ–జీపీఎస్సీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఒకవేళ ఎనిమిది నెలల్లో ప్రక్రియ పూర్తి చేయపోతే మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# ఆ ప్రమాదాలు, మరణాల వార్తలు నిజమే : రిషబ్ శెట్టి



కన్నడ ప్రేక్షకులతో పాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కాంతార : చాప్టర్ 1' సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దసరా కానుకగా విడుదల కాబోతున్న కాంతార 1 సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను బెంగళూరులో భారీ ఎత్తున నిర్వహించారు. చిత్ర యూనిట్ సభ్యులతో పాటు, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో హాజరు అయ్యారు. జాతీయ మీడియాతో పాటు పలు భాషల మీడియా వారిని కాంతార టీం ఆహ్వానించారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా రిషబ్ శెట్టి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయ్యాయి. ఆరు నెలలుగా ఉన్న పుకార్లకు ఆయన స్పీచ్‌లో సమాధానం లభించింది. చాలా నెలలుగా మీడియాలో ప్రచారంలో ఉన్న కొన్ని వార్తలను ఆయన నిజమే అంటూ ప్రకటన చేయడంతో మరింత చర్చ జరుగుతోంది. కాంతార చాప్టర్ 1 షూటింగ్ సమయంలో.. కాంతార చాప్టర్ 1 సినిమా ప్రారంభించినప్పటి నుంచి సెట్స్ లో, చిత్ర యూనిట్ సభ్యుల్లో అనేక అవాంఛనీయ సంఘటలను జరిగాయని, అందువల్ల పలువురు మృతి చెందారని, కొందరు సెట్స్ నుంచి ప్రాణ భయంతో పారిపోయారు అంటూ రకరకాలుగా పుకార్లు షికార్లు చేశాయి. దైవత్వంతో చేస్తున్న కాంతార సినిమా షూటింగ్ సమయంలో చిన్న సంఘటన జరిగినా పెద్ద విషయంగా ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఏదో ఒక విషయం గురించి కన్నడ నెటిజన్స్ మాట్లాడుకుంటూ వచ్చారు. కాంతార చాప్టర్ 1 షూటింగ్ పూర్తి చేసుకుంటుందా అనే అనుమానాలను కూడా కొందరు వ్యక్తం చేశారు.

ఆ స్థాయిలో సినిమా షూటింగ్ సమయంలో అవాంతరాలు, అడ్డంకులు వచ్చాయి అనేది ప్రతి ఒక్కరూ మాట్లాడుకున్నారు. తాజాగా రిషబ్ శెట్టి ఆ విషయాలపై మాట్లాడుతూ కొన్ని సంఘటనలు నిజంగా జరిగినట్లు పేర్కొన్నాడు. కాంతార ట్రైలర్ లాంచ్‌లో రిషబ్ శెట్టి స్పీచ్ ట్రైలర్ విడుదల సందర్భంగా రిషబ్ శెట్టి మాట్లాడుతూ.. సినిమాను సరైన సమయంలో పూర్తి చేయడం కోసం చిత్ర యూనిట్ సభ్యులందరం దాదాపుగా మూడు నెలల పాటు కనీసం నిద్ర హారాలు లేకుండా కష్టపడ్డాం. డైరెక్షన్ టీం, ప్రొడక్షన్ టీం మాత్రమే కాకుండా నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులు అంతా కూడా చాలా కష్టపడి, తమ సొంత సినిమాగా భావించి వర్క్ చేశారు. అందుకే సినిమా ఈ స్థాయిలో మంచిగా వచ్చింది, అంతే కాకుండా సినిమాను అనుకున్న సమయంకు పూర్తి చేశాం. సినిమా షూటింగ్ కోసం కష్టపడుతున్న సమయంలో కొన్ని అనుకోని సంఘటనలు జరిగిన మాట వాస్తవం అన్నాడు. కొన్ని ప్రమాదాలు జరిగాయి, కొందరిని కోల్పోవాల్సి వచ్చింది. కాంతార కోసం పని చేసిన ప్రతి ఒక్కరూ వెనక్కి తిరిగి చూడకుండా షూటింగ్‌ను ముందుకు తీసుకు వెళ్లడానికి తమ ప్రాణాలను సైతం లక్ష్యపెట్టకుండా పోరాటం చేశారు. కాంతార చాప్టర్ 1 కలెక్షన్స్ టార్గెట్ రూ.1000 షూటింగ్ సమయంలో నా టీం మెంబర్స్ మాత్రమే కాకుండా నేను కూడా ప్రమాదానికి గురి కావాల్సి వచ్చింది. షూటింగ్ సమయంలో నేను నాలుగు ఐదు సార్లు ప్రమాదానికి గురి అయ్యాను. ఆ సమయంలో చనిపోతాను అనుకున్నాను. కానీ మేమంతా విశ్వసించే దైవం మా ప్రాణాలను కాపాడింది. మాకు దేవుడి ఆశీర్వాదం ఉందని చాలా సందర్భాల్లో అనిపించింది. ఈ సినిమాను పూర్తి చేయడంకు మా కష్టం మాత్రమే కాకుండా మా వెంట దైవం ఉందని అర్థం అయింది. అందుకే ఈ సినిమాను ఇంత ఈజీగా పూర్తి చేశామని ఆయన అన్నారు. ఈ సినిమాకు రిషబ్ శెట్టి దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా నటించడంతో అంచనాలు మరింతగా ఉన్నాయి. కాంతార సినిమా భారీ వసూళ్లు సాధించిన నేపథ్యంలో కాంతార చాప్టర్ 1 సినిమా ఖచ్చితంగా రూ.1000 కోట్ల సినిమా అంటూ ప్రేక్షకులు ముఖ్యంగా యూనిట్ సభ్యులు నమ్మకంగా ఉన్నారు.

# నానితో కలిసి రాలేదు పీకేతోనైనా కలిసొస్తుందా?

కన్నడ బ్యూటీ ప్రియాంక మోహన్ నాని హీరోగా నటించిన %-%గ్యాంగ్ లీడర్%-% తో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పటికి కన్నడలో ఒక్క సినిమానే చేసింది. అయినా నాని టీమ్ అందం, అభినయం గల నాయిక కావడంతో మరో ఆలోచన లేకుండా ఎంపిక చేసారు. ఈ సినిమా కమర్శియల్ గా సక్సెస్ కానప్పటికీ నటిగా ఓ ఐడెంటిటీని తెచ్చిపెట్టింది. అటుపై శర్వానంద్ కు జోడీగా %-%శ్రీకారం%-%లో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమా కూడా అమ్మడిని నిరాశ పరిచింది. దీంతో టాలీవుడ్ లో మళ్లీ ఛాన్స్ రావడానికి మూడేళ్లు పట్టింది. మధ్యలో తమిళ్ లో కొన్ని సినిమాలు చేసింది. అటుపై మళ్లీ ప్రియాంక మోహన్ బాధ్యత నానినే తీసుకున్నాడు. %-%సరిపోదా శనివారం%-%లో హీరోయిన్ గా అవకాశం ఇచ్చాడు. ఈ సినిమా మాత్రం మంచి విజయం సాధించింది. కానీ వెంటనే అవకాశాలు అందుకోవడంలో మాత్రం మళ్లీ విఫలమైంది. సరిగ్గా అదే సమయంలో - ఓజీ - సినిమాకు సుజిత్ హీరోయిన్ గా ఛాన్స్ ఇచ్చాడు. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తోన్న చిత్రమిది. ఈ సినిమాపై అంచనాలు ఎలా ఉన్నాయి? అన్నది చెప్పాల్సిన పనిలేదు. పవన్ కూడా చాలా ఆశలు పెట్టుకున్న ప్రాజెక్ట్ ఇది. అన్ని వైఫల్యాలకు - ఓజీ - సక్సెస్ ఒక్కటే సమాధానం చెబుతుందని నమ్ముతున్నారు. అటు ప్రియాంక ఆశలన్నీ కూడా ఇదే ప్రాజెక్ట్ పై ఉన్నాయి. ఈ సినిమా విజయంతో బిజీ నటిగా మారాలని ఆశిస్తుం ది. ప్రియాంక గురించి పీకే ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ప్రత్యేకంగా మాట్లాడిన సంగతి తెలిసిందే. ప్రతిభావం తురాలని.. మంచి పాత్రతో ప్రేక్షకుల్ని అలరిస్తుందన్నారు. ఇండస్ట్రీలో మంచి భవిష్యత్ ఉంటుందని ఆకాంక్షించారు. మరేం జరుగుతుందన్నది చూడాలి. అయితే ఇక్కడే ఓ వార్త కూడా తెరపైకి వస్తోంది. పవన్ కళ్యాణ్ తో హీరోయిన్ గా నటించిన భామలు పెద్దగా సక్సెస్ అవ్వలేదనే విమర్శ చాలా కాలంగా ఉంది. ప్రత్యేకించి డెబ్యూ చిత్రాలు ఆయనతో చేస్తే కెరీర్ స్లోగా ఉంటుందనే వాదన ఇండస్ట్రీలో వినిపిస్తుంటుంది. ఆయన సరసన నటించిన వారు అతికొద్ది మంది మాత్రమే సక్సెస్ అయ్యారని అంటారు. పవన్ సరసన ఏ హీరోయిన్ ఎంపికైనా రిలీజ్ సమయంలో ఈ విమర్శ తెరపైకి వస్తుంటుంది. మరి ఆ విమర్శను -ఓజీ - తో తుడిచి పెట్టేస్తారేమో చూడాలి. %-%ఓజీ%-% విజయం అనంతరం ప్రియాంక మోహన్ ఓ నాలుగైదు కొత్త ప్రాజెక్ట్ లకు సైన్ చేస్తే ఆ విమర్శ గంగలో కలిసినట్లే.








# మామ్ అయిన తర్వాత మొదటి చిత్రం!

బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్ ధాంపత్య జీవితంలోకి అడుగు పెట్టిన తర్వాత మునుపటి లా స్పీడ్ గా సినిమాలు చేయని సంగతి తెలిసిందే. అటుపై బేబి జన్మించడంతో పాపాయికే ఎక్కువ సమయం కేటాయించింది. వెండి తెరపై సోనమ్ కపూర్ కనిపించి రెండేళ్లు అవుతుంది.%-% బ్లైండ్%-% తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమైంది. క్యామియో పాత్రల్లో కూడా కనిపించలేదు. పూర్తిగా ఫ్యామిలీ లైఫ్ కే బాండ్ అయింది. మరి ఇక అమ్మడు సినిమాలు చేయదా? నటనకు రిటైర్మెంట్ ఇచ్చేసిందా? అంటే అబ్బెం అలాంటిదేమీ లేదంటూ తాజా అప్ డేట్ అందించింది. కుమారుడి కోసమే సమయమంతా: ఈ గ్యాప్ కి గల కారణాన్ని రివీల్ చేసింది. బలమైన పాత్రల్లో మాత్రమే కనిపించాలనే కారణంగానే దూరంగా ఉన్నట్లు తెలిపింది. కొంత కాలం విరామం వచ్చినంత మాత్రాన ఎంపికల్లో ఎలాంటి తేడా ఉండదని స్పష్టం చేసింది.

తల్లిగా వీలైనంనంత సమయాన్ని కుమారుడి కోసం కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జీవితంలో అవి ఎంతో అద్భుతమైన క్షణాలుగా భావించానంది. సినిమాలకు దూరమైనా ఈ అనుభూతి మాత్రం ఎంతో గొప్పగా ఉందంది. ఈ దశ తనని మరింత బలంగా మార్చిందన్నారు. సినిమా వివరాలు గోప్యంగా: %-%సహనంతో ఉండటం నేర్పించింది. నాలో బలహీనతలు తెలుసుకోవడానికి ఇది సరైన సమయంగా అనిపించింది. మళ్లీ కెమెరా ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నాను. అమ్మ అయిన తర్వాత నా తొలి చిత్రం ఇదే ఏడాది ఆఖర్లో ప్రారంభమవుతుందని వెల్లడించింది. దీంతో సోనమ్ కపూర్ కంబ్యాక్ అధికారికంగా కన్ఫమ్ అయింది. అయితే ఆ సినిమా ఏంటి? ఏ హీరో సరసన నటిస్తుంది? దర్శకుడు ఎవరు? నిర్మాణ సంస్థ ఇలాంటి వివరాలేవి రివీల్ చేయలేదు. వాటి ప్రకటనకు ఇది సరైన సమయం గా భావించలేదు. అతి త్వరలోనే ఆ వివరాలు కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది. తండ్రికి తగ్గ తనయగా: అనీల్ కపూర్ వారసురాలిగా సోనమ్ కపూర్ బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. %-%సవారియా%-%తో బ్లాక్ బస్టర్ అందుకుంది. అటుపై %-%ఢిల్లీ6%-, -%రాంఝానా%-, -%నీర్జా%-, -%ప్రేమ్ రతన్ ధన్ పాయో%-, -%వీర్ ది వెడ్డింగ్%-, -%ప్యాడ్ మాన్%-% లాంటి ఎన్నో చిత్రాల్లో నటించి హిట్లు అందుకుంది. నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకుంది. కెరీర్ పీక్స్ లో ఉండగానే వివాహం చేసుకుంది. అటుపై బిడ్డ పుట్టడం అన్నీ అమ్మడి కెరీర్ లో వేగంగా జరిగిపోయాయి.

# సహనటుడితో జాన్వీ సరసంగా.. ఆ చీర ప్రత్యేకతే అది!





అందమైన చీర రవికెలో హృదయాలను కొల్లగొట్టడంలో క్లాసిక్ దే నటీమణులకు ఉన్న ప్రత్యేకతే వేరు. ఆ రోజుల్లో చీరకు ప్రాధాన్యత అధికం. చాలా మంది సీనియర్ నటీమణుల బాటలో శ్రీదేవి కూడా చీర ధరించి ఎక్కువగా వేదికలపై ప్రత్యేకంగా కనిపించేవారు. చీరలో శ్రీదేవి అందం, అభినయం గురించి ఎక్కువగా యువతరం వర్ణించడంలో బిజీగా ఉండేది. ఇటీవల హెూంబౌండ్ సినిమాను 2026 ఆస్కార్స్ లో ప్రమోట్ చేస్తున్న సమయంలో కొలీగ్ జిమ్ సరాఫ్ తో కలిసి కని పిం చింది.. ఆ సమ యంలో కళ్లన్నీ జాన్వీ కపూర్ ధరించిన నావీ బ్లూ శారీపైనే. చీరలో జాన్వీ ఎంతో మగ్ధ మనో హరంగా కనిపించింది. అయితే ఈ చీరకు ఓ ప్రత్యేకత ఉంది. ఇద చీరలో జాన్వీ తల్లిగారైన శ్రీదేవి 2017లో విరాట్ కోహ్లీ-అనుష్క శర్మ జంట విందు కార్య క్రమంలో కనిపించారు. ఇప్పుడు మళ్లీ ఆ చీరను ధరించి హెూంబౌండ్ ఈవెంట్ కి రావడం ఆసక్తిని కలిగించింది. జాన్వీ కపూర్ వీలున్న ప్రతి వేదికపైనా మామ్ శ్రీదేవిని గుర్తు చేస్తూనే ఉంది. సందర్భానుసారం తన తల్లిగారిని స్ఫురణకు తెచ్చుకునేలా అభిమానులకు రిమైండ్ చేస్తోంది. నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన హెూంబౌండ్ కి క్రిటిక్స్ నుంచి ప్రశంసలు కురుస్తున్నాయి. ఆస్కార్ బరిలో ఈ చిత్రం అవార్డును కొల్లగొట్టాలని జాన్వీ అభిమానులు కోరుకుంటున్నారు. ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాల్య స్నేహితులు పోలీసులు కావాలని కలలు కంటారు. కానీ కులమతాల కారణంగా ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు? అనే సామాజిక ఇతివృత్తం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈనెల 26న ఈ చిత్రం విడుదల కానుంది.

# ప్యారడైజ్ కథానాయిక ఎవరు..?




సినిమాలో హీరోయిన్ ఎవరన్నది ఇంకా రివీల్ కాలేదు. ఆ విషయాన్ని చిత్ర యూనిట్ చాలా సీక్రెట్ గా ఉంచుతుంది. ది ప్యారడైజ్ సినిమాలో నాని సరసన నటించే ఛాన్స్ ఎవరికి ఇస్తున్నారన్నది ఇంకా సస్పెన్స్ గానే ఉంది. ఎలాగు దసరా కాంబినేషన్ సినిమా కాబట్టి మళ్లీ కీర్తి సురేష్ ని తీసుకుంటారా అంటే చెప్పడం కష్టమని అంటున్నారు. ది ప్యారడైజ్ మాస్

నాని ప్యారడైజ్ సినిమా సీక్రెసీ స్ట్రాటజీ ఏంటో కానీ శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమా విషయంలో మేకర్స్ చాలా సైలెంట్ గా పని కానిస్తున్నారు. ముఖ్యంగా నాని జడల్ రోల్ ఆ పాత్ర డీటైల్స్ సంథింగ్ వెరీ క్యూరియస్ గా అనిపిస్తున్నాయి. ప్యారడైజ్ సినిమా విషయంలో ఫస్ట్ స్టేట్మెంట్ తో పాటు రీసెంట్ గా వచ్చిన జడల్ క్యారెక్టర్ రివీల్ వీడియో కూడా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసింది. ది ప్యారడైజ్ సినిమా ని సుధాకర్ చెరుకూరి ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తుంది. విలన్ గా టర్న్ తీసుకుని.. అంతేకాదు ది ప్యారడైజ్ సినిమాలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ గా చేస్తున్నారన్న టాక్ తెలిసిందే. మోహన్ బాబు కెరీర్ మొదలైంది విలన్ గానే.. ఆ తర్వాత ఆయన హీరోగా అదరగొట్టారు. మళ్లీ ఇప్పుడు విలన్ గా టర్న్ తీసుకుని చేస్తున్నారు. మోహన్ బాబు విలనిజం ది ప్యారడైజ్ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ అవుతుందని తెలుస్తుంది.

ఇక ఈ సినిమా 1980 బ్యాక్ డ్రాప్ లో వస్తుందని తెలుస్తుంది. ఐతే అంతా బాగానే ఉంది కానీ ది ప్యారడైజ్ అప్పీల్.. నాని ఈమధ్య వరుస హిట్ సినిమాలతో దూసుకెళు _తున్నాడు. తప్పకుండా ఈసారి దసరాని మించిన సక్సెస్ అందించేలా ఉన్నారు.

నాని దసరా సినిమాతో మాస్ స్టెప్ వేయగా ది ప్యారడైజ్ సినిమా వేరే లెవెల్ మాస్ అప్పీల్ తో వస్తుందని తెలుస్తుంది. ది ప్యారడైజ్ సినిమా అన్ని సర్ ప్రైజ్ లతో నింపుతున్నాడట శ్రీకాంత్ ఓదెల. సినిమాలో జడల్ రోల్ లో నాని ఊహించని విధంగా కనిపిస్తారట. హీరోయిన్ రోల్ కి మంచి స్కోప్ ఉందని టాక్.

నాని ప్యారడైజ్ సినిమా 24 మార్చి 2026 రిలీజ్ లాక్ చేశారు. సినిమా రిలీజ్ టార్గెట్ పెట్టుకుని మరీ సినిమా ప్లాన్ చేస్తున్నారట. నాని శ్రీకాంత్ ఈ ఇద్దరు కలిసి మరోసారి మాస్ ట్రీట్ ఇవ్వాలని చూస్తున్నారు. మరి ఈ సినిమా ఎలాంటి అంచనాలతో వస్తుందో చూడాలి.

నాని ది ప్యారడైజ్ సినిమా అతని కెరీర్ లోనే హైయ్యెస్ట్ బడ్జెట్ తో వస్తుంది. ఎస్.ఎల్.వి సినిమాస్ ఈ మూవీని భారీ బడ్జెట్ తో విజువల్ ట్రీట్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు.

# 'ఓజీ'లో సుభాష్ చంద్రబోస్ ఏంటీ..!!

పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్‌తో పాటు తెలుగు ప్రేక్షకులు అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా 'ఓజీ'. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్‌ను చాలా విభిన్నంగా చూడబోతున్నాం. మరికొన్ని గంటల్లో ఓజీ ఆట షురూ కానుంది. ఇప్పటికే సినిమా రికార్డ్ స్థాయి అడ్వాన్స్ బుకింగ్ నమోదు చేసింది. బాక్సాఫీస్ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం మొదటి రోజు ఖచ్చితంగా రూ.50 కోట్లను మించి వసూళ్లు నమోదు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ కెరీర్‌లో చాలా కాలం తర్వాత ఈ స్థాయి హైప్ రావడం ఇదే అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోనూ పవన్ మాట్లాడుతూ ఖుషి తర్వాత మళ్లీ ఫ్యాన్స్‌లో ఈ స్థాయి ఉత్సాహం చూస్తున్నాను అన్నాడు. అందుకు కారణం సుజీత్ దర్శకత్వం ఒకటి అయితే, సినిమాకు చేసిన ప్రమోషన్ ఒకటి అనడంలో సందేహం లేదు. అందుకే ఓజీ కోసం ఇప్పుడు జనాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఓజీ మొబైల్ గేమ్‌లో సుభాష్ చంద్రబోస్ ఓజీ సినిమాకు ఉన్న క్రేజ్ నేపథ్యంలో మేకర్స్ ఒక మొబైల్ వీడియో గేమ్‌ను లాంచ్ చేయడం జరిగింది. ఆ వీడియో గేమ్ లో మూడు లెవల్స్ ఉన్నాయి. వీడియో గేమ్ లో ఒక కథను నడిపిస్తూ లెవల్స్ సాగుతూ ఉంటాయి. అయితే ఆ కథ సినిమాలో ఉన్న కథ కాకుండా, సినిమాలోని కథకు ప్రీక్వెల్‌గా ఉంటుంది. ఆ కథలో ముందుకు వెళ్తున్నా కొద్ది ఒక లెవల్ లో సుభాష్ చంద్రబోస్ సైతం వస్తాడు. గేమ్ ఆడిన వారు, ఆ లెవల్ వరకు వెళ్లిన వారు సుభాష్ చంద్రబోస్‌ను ఎక్స్‌పీరియన్స్ చేస్తున్నారు. గేమ్‌ను విభిన్నంగా డిజైన్ చేయడంతో పాటు, కథ మాదిరిగా ముందుకు తీసుకు వెళ్లడం ద్వారా ఓజీ సినిమాకు మరింత బలం చేకూరినట్లు అవుతుందని, ఇదో మంచి పబ్లిసిటీ స్టంట్ అంటూ వార్తలు వస్తున్నాయి. మొత్తానికి ఓజీ సినిమాలో సుభాష్ చంద్రబోస్ ఉండడు కానీ,

ఓజీ మొబైల్ గేమ్‌లో మాత్రం బోస్ కనిపిస్తున్నారు. ఓజీ కత్తిలో కనిపించేది అకీరా నందన్ ఇక ఈ సినిమాలో అకీరా ఉంటాడు అంటూ చాలా కాలంగా వార్తలు వస్తున్నాయి. సుజీత్ ను అడిగితే ఆయన పలు ఇంటర్వ్యూల్లో ఈ విషయాన్ని సున్నితంగా దాటవేస్తూ వచ్చారు. కొందరు అసలు నిజం కాదు అన్నట్లుగా మాట్లాడారు. కానీ తాజాగా విడుదల అయిన ట్రైలర్‌ను చూస్తే మాత్రం అకీరా ఉన్నట్లుగానే అనిపిస్తోంది. ఒక కత్తిలో ఫేస్ను లైట్‌గా రివీల్ చేయడం జరిగింది. కత్తిలో కనిపిస్తున్న కళ్లు చూస్తూ ఉంటే అవి అకీరా కళ్లు అయ్యి ఉంటాయి అని చాలా మంది స్క్రీన్ షాట్స్ తీసి మరీ చర్చించుకుంటున్నారు. అకీరా కళ్లు, ఆ కళ్లు పక్కన పెట్టి పోల్చుతున్నారు. ఖచ్చితంగా అకీరా ఉంటాడు, అతి ఎలా ఉంటాడు, ఏ సమయంలో ఉంటాడు అనేది చూడాలని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. అకీరా సినిమా ఎంట్రీకి రెడీ అవుతున్నాడు అని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అది ఓజీతో అయితే బాగుంటుంది, ముందు ముందు అకీరా హీరోగా సినిమాలు రావడం ఖాయం అని ఓజీ విడుదల తర్వాత మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. రాహుల్ రవీంద్రన్ కనిపించడు ఓజీ సినిమా గురించి మరో ఆసక్తికర వార్త ఒకటి చక్కర్లు కొడుతోంది. సినిమాలో రాహుల్ రవీంద్రన్ నటించాడు, కానీ ఆయన సినిమాలో కనిపించబోవడం లేదని అంటున్నారు. రాహుల్ రవీంద్రన్ కోసం దర్శకుడు సుజీత్ ఒక మంచి పాత్రను అనుకున్నాడు. షూటింగ్ కూడా జరిగిందట. దాదాపు పది నుంచి పదిహేను రోజుల పాటు రాహుల్ రవీంద్రన్ షూటింగ్‌లో పాల్గొన్నాడని కూడా సమాచారం ఉంది. ట్రైలర్‌లోనూ ఒక షాట్‌లో రాహుల్ రవీంద్రన్ కనిపిస్తాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ ఓజీ సినిమా కోసం షూటింగ్‌లో పాల్గొన్న మాట వాస్తవం. కానీ ఫైనల్ ఎడిట్‌లో నా పాత్రను తొలగించాల్సి వచ్చిందని అన్నారు. నా పాత్రను తొలగించడం అనేది దర్శకుడి నిర్ణయం కాబట్టి నేను అడ్డు చెప్పలేక పోయాను. ఫైనల్ గా సినిమా బాగా రావాలని దర్శకులు కోరుకుంటారు. కనుక వారి నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందే అనేది నా అభిప్రాయం అన్నాడు. ఓజీ వంటి సినిమాలో ఛాన్స్ రావడం గొప్ప విషయం, కానీ చివరికి అందులో నా పాత్రను తొలగించడం ఖచ్చితంగా బాధ కలిగించే విషయం అని రాహుల్ అన్నారు.

Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.